సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
మంగళవారం, 24.02.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 124
పేజీలు: 12 వెల: రూ. 5

# అడవి వీడిన మీసాల సింహం



మావోయిస్టు అగ్రనేత మీసాల రాజిరెడ్డి లొంగుబాటుతో ముగిసిన ఒక విప్లవ శకం!

- వరుస ఎన్‌కౌంటర్లు, అగ్రనేతల లొంగుబాట్లు
- ఎన్‌కౌంటర్లు, అరెస్టులు. నాయకత్వంలో ఖాళీలు
- మొదటి తరం అంతం.. విప్లవ శకానికి ముగింపు సంకేతాలు
- దేవ్ జీ, రాజిరెడ్డి లొంగుబాటు ఉద్యమానికి కీలక మలుపు

10

నాడు పసిబిడ్డను వదిలి అడవి బాట పట్టిన ఆ పాదాలు.. ఐదు దశాబ్దాల పోరాటం తర్వాత నేడు అలసిపోయి ఊరి బాట పట్టాయి. తుపాకీ పట్టిన చేతులు వృద్ధాప్యంతో వణికినా, గుండెల్లో రగిలిన సమసమాజ స్వప్నం మాత్రం ఆశించిన గమ్యం చేరకుండానే 'మౌనంగా' జనజీవన స్రవంతిలో కలిసిపోతోంది. ఒక విప్లవ శకం.. ఒక ఊహించని ముగింపు వైపు పయనిస్తోంది..

# కాంగ్రెస్ దోపిడీ

## కేంద్రమంత్రి బండి సంజయ్
## జరిమానాలు పెంచి టార్గెట్లు



- అకౌంట్ల నుంచి డబ్బులు కట్ చేసే నిర్ణయాన్ని మార్చుకోవాలి
- ఏడాదిలో రూ. 108.33 కోట్ల నుంచి రూ. 275.05 కోట్లకు పెరిగిన చాలానా వసూళ్లు

03

# ఫాంహౌస్ పాలసీ

## ఇక పర్మిషన్ తప్పనిసరి

- అడ్డగోలు నిర్మాణాలకు చెక్.. ఫాంహౌస్‌లపై ప్రభుత్వ కఠిన నిర్ణయం
- రేవంత్ సర్కార్ కొత్త ప్లాన్.. ఫాంహౌస్‌లకు ప్రత్యేక నిబంధనలు
- 1,200 గజాలు తప్పనిసరి.. చిన్న ప్లాట్లలో ఫాంహౌస్‌కు నో
- 20% మాత్రమే నిర్మాణం.. మిగతా భూమి సాగుకే వినియోగం
- నగర పరిసరాల్లో పెరుగుతున్న ఫాంహౌస్‌లకు నియంత్రణ

**అనుమతులతోనే ఫాంహౌస్‌లు..**

**ఆదాయం పెంపు లక్ష్యంగా కొత్త విధానం**




**ముద్ర, తెలంగాణ బ్యూరో:** ఫాంహౌస్‌లు నిర్మాణానికి పర్మిషన్ తప్పనిసరి చేసేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. ఈ కొత్త పాలసీపై రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఫాంహౌస్‌లు నిర్మించేందుకు ఒక ప్రత్యేక విధానాన్ని తీసుకురావాలని యోచిస్తోంది. ఇప్పటి వరకు ఫాంహౌస్‌ల నిర్మాణాలకు ఎలాంటి స్పష్టమైన రూల్స్ లేకపోవడంతో.. ఇష్టం వచ్చినట్లు నిర్మాణాలు జరుగుతున్నాయని భావించిన ప్రభుత్వం.. సరికొత్త నిబంధనలు ప్రవేశపెట్టేందుకు రెడీ అయింది.

**ఫాంహౌస్ డిమాండ్**

ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్, జనాల రద్దీ, పొల్యూషన్ తట్టుకోలేక.. వీకెండ్, సెలవులు వచ్చాయంటే చాలు.. నగరవాసులు మిగతా 02లో

## ఇంటర్ పరీక్షలకు
# ఏర్పాట్లు పూర్తి
## 25వ తేదీ నుంచి మార్చి 18 వరకు నిర్వహణ



- దాదాపు 10 లక్షల మంది విద్యార్థులు హాజరు కానున్న పరీక్షలు
- 1,495 కేంద్రాలు.. 28,500 మంది ఇన్విజిలేటర్లతో బందోబస్తు
- మాల్ ప్రాక్టీస్‌పై కఠిన చర్యలు.. సీసీ కెమెరాల నిఘా
- 7,500 సీసీ కెమెరాలతో కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షణ

09

## ఉద్యమకారులకు
# ఊరట
## అభయహస్తంపై హైకోర్టు కఠిన ఆదేశాలు



- 8 వారాల్లో అమలు చేయాలి..
- ప్రభుత్వానికి కోర్టు స్పష్టమైన గడువు
- హామీల ఆలస్యం ఎందుకు? నివేదిక ఇవ్వాలని హైకోర్టు ప్రశ్న
- అభయహస్తం అమలు పై స్పష్టత కోరిన కోర్టు.. జీఓపై ఫోకస్

09

- ఎల్ అండ్ టీ నుంచి మెట్రో రైలు స్వాధీనం
- కాంగ్రెస్ ఆఫీసులకు జిల్లాల్లో భూకేటాయింపులు
- ఇండ్ల గణనపై సుదీర్ఘ చర్చ
- 34 ప్రశ్నలతో ఇంటింటి గణన
- 89 వేల మంది సిబ్బంది నియామకం
- మే 11 నుండి జూన్ 9 వరకు ఇండ్ల నమోదు
- తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు
- ఖమ్మంలో టీటీడీ ఆలయానికి భూమి..
- గుమ్మడూరులో జేఎన్‌టీయూ కాలేజీకి గ్రీన్ సిగ్నల్
- రాష్ట్ర అభివృద్ధికి సంచలన నిర్ణయాలు..




## మార్చి 20న
# రాష్ట్ర బడ్జెట్
## డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా వైద్య విధాన పరిషత్
## వచ్చే ఏడాది ఫిబ్రవరిలో తుది జన గణన

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** మార్చి 16 నుంచి 30వ తేదీ వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నది. అదే నెల 16న గవర్నర్ ప్రసంగం, 17, 18న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం, మార్చి 20వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించింది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గం 28వ సమావేశంలో కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకున్నది. ఇందులో సీఎం, మంత్రులతో కలిసి రాష్ట్ర పురోగతికి సంబంధించిన పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా కేంద్రం తెలంగాణలో చేపట్టే కులగణన, హైదరాబాద్ మెట్రో రైలు వ్యవహారం, వైద్య విధాన పరిషత్‌లో మార్పులు, భూ కేటాయింపులు, అసెంబ్లీ సమావేశాలు, బడ్జెట్ ప్రవేశం అంశాలకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. రాష్ట్రంలోని వైద్య రంగంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన కేబినెట్.. 'తెలంగాణ వైద్య విధాన పరిషత్' మిగతా 02లో



## అసలు వదిలి
# కొసరు పట్టారు
## అధికారుల తీరుపై స్థానికుల విస్మయం!
## ఏడంతస్థుల అక్రమ నిర్మాణం సేఫ్..

- మూడంతస్థుల భవనం సీజ్
- 'ముద్ర' కథనానికి స్పందన
- మున్సిపల్ శాఖలో 'సెలెక్టివ్' యాక్షన్
- బడా బాబుల జోలికి వెళ్లే ధైర్యం లేదా?
- ఫ్లెక్సీలతో సరిపెట్టిన అధికారులు
- సీజ్ ఆర్డర్లు చిన్న భవనానికేనా.. పెద్ద వాటికి వర్తించవా?

02




బడా చేపలను వదిలేసి.. బుడగ చేపలను వేటాడినట్లుంది మాదాపూర్ మున్సిపల్ అధికారుల తీరు. కళ్లముందే ఏడంతస్థుల అక్రమ కట్టడం అడ్డగోలుగా వెలుస్తున్నా 'కళ్లు మూసుకున్న' అధికారులు, కేవలం మూడంతస్థుల భవనాన్ని సీజ్ చేసి తాము చాలా స్ట్రిక్ట్ అని కలరింగ్ ఇస్తున్నారు. రూ. 20 కోట్ల విలువైన అక్రమణల జోలికి వెళ్లకుండా, కేవలం చిన్న నిర్మాణాలపై ప్రతాపం చూపడం వెనుక అసలు కథేంటోనని ఇజ్జత్ నగర్ వాసులు ముక్కున వేలేసుకుంటున్నారు.

-శేరిలింగంపల్లి, ముద్ర:



# గోవర్ధనుడిగా నర్సింహుడు
## సింహ వాహన సేవలో భక్తులకు దర్శనం

- పురవీధుల్లో ఊరేగిన స్వామివారు
- ఆకట్టుకున్న సాహిత్య సంగీత సభ

03

-ముద్ర ప్రతినిధి, భువనగిరి

## కుల వివక్ష.. పసికందు బలి..
# బీసీ కమిషన్ సీరియస్
## కుమ్మెర మల్లన్న జాతర ఘటనపై సుమోటో చర్య

- నాగర్ కర్నూల్ కలెక్టర్, ఎండోమెంట్స్ కమిషనర్‌కు నోటీసులు జారీ
- ఆలయ ప్రవేశం నిరాకరణతో ఘర్షణ..
- నిర్వాహకుల తన్నడంతోనే చిన్నారి మృతి అంటూ తల్లిదండ్రుల ఆరోపణ
- మూడు రోజుల్లో నివేదిక కోరిన కమిషన్.. దోషులకు కఠిన చర్యల డిమాండ్

09



# గ్లోబల్ వాల్యూ హబ్‌గా హైదరాబాద్



## 'ది హార్ట్ ఫోర్డ్ ఇండియా టెక్నాలజీ సెంటర్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

- 'రెడీ టూ వర్క్ ఫోర్స్' గా తెలంగాణ యువత
- ఆవిష్కరణలకు ఊతమిచ్చే ఇన్నోవేషన్ ఎకో సిస్టం

03

## పంచాయితీరాజ్
# ప్రక్షాళన?
## స్థానిక సంస్థల్లో పాత పద్ధతికే సర్కార్ మొగ్గు?

- ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థ రద్దుపై ప్రభుత్వ ఆలోచనలు
- సర్పంచ్‌లే మండల అధ్యక్షులు ఎంపీపీలే జెడ్పీ చైర్మన్లు?



- పాత విధానాన్ని తీసుకురావాలన్న సర్కార్ ప్రయత్నం
- 73వ రాజ్యాంగ సవరణ తర్వాత మరో కీలక మలుపు?
- ఎన్నికల ఖర్చు తగ్గింపు లక్ష్యమా లేక రాజకీయ లెక్కలా?
- గ్రామస్థాయిలో సర్పంచ్‌లకు పెరుగుతున్న ప్రాధాన్యం

**ముద్ర డెస్క్:** తెలంగాణలో పంచాయతీరాజ్ వ్యవస్థలో సమూల మార్పులకు రంగం సిద్ధమవుతోంది. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఎంపీటీసీ (మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుడు), జెడ్పీటీసీ (జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుడు) వ్యవస్థలను రద్దు చేసి, నేరుగా సర్పంచ్‌లే మండల పరిషత్ అధ్యక్షులను (ఎంపీటీసీ), ఎంపీపీలే జిల్లా పరిషత్ చైర్మన్లను ఎన్నుకునే పాత విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సూత్రప్రాయంగా తెలియవచ్చింది. మిగతా 02లో

# ఎడ్ సెట్ నోటిఫికేషన్ రిలీజ్
## మే 12న ఎడ్‌సెట్ పరీక్ష

- 23 నుంచి దరఖాస్తుల ప్రారంభం
- ఏప్రిల్ 15 వరకు ఫైన్ లేదు
- 2 సెషన్లలో పరీక్షలు
- మే 30న ఫలితాలు

09



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 24.02.2026
www.mudranews.in | @mudranews



**సమతుల్య ఆహారం తీసుకోవడం**



పండ్లు, కూరగాయలు, ప్రోటీన్లు, ధాన్యాలు సమతుల్యంగా ఉండేలా ఆహారం తీసుకోవాలి. జంక్ ఫుడ్ తగ్గిస్తే శరీరం బలంగా ఉంటుంది.

# అసలు వదిలి కొసరు పట్టారు

**శేరిలింగంపల్లి, ముద్ర:** మాదాపూర్ ఇజ్జత్ నగర్‌లో మున్సిపల్ అధికారుల చర్యలు 'విడ్డూరం'గా మారాయి. కళ్ల ముందే ఏడంతస్థుల భారీ అక్రమ కట్టడం వెలుస్తున్నా పట్టించుకోని అధికారులు, కేవలం మూడంతస్థుల భవనాన్ని సీజ్ చేసి చేతులు దులుపుకోవడం చర్చనీయాంశమైంది. 'అసలు వదిలి కొసరుతో సరిపెట్టుకోవడం' అంటే ఇదేనంటూ విమర్శిస్తున్నారు.

**'ముద్ర' కథనంతో కదిలిన యంత్రాంగం**

ఇజ్జత్ నగర్ గ్రామంలోని 20 ఫీట్ల రోడ్డును ఆక్రమించి చేస్తున్న అక్రమ నిర్మాణాలపై 'హై టెక్ సిటీలో హై–టెక్ ఆక్రమణ' పేరుతో ఈ నెల 13న 'ముద్ర' దినపత్రికలో వచ్చిన కథనం అధికారుల్లో చలనం తెచ్చింది. స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్ తన సిబ్బందితో కలిసి శనివారం గంగాల శంకర్ యాదవ్ (ఇంటి నెం. 2–14/2/1/2) నిర్మాణాన్ని నిలిపివేస్తూ సీజ్ ఆర్డర్లను అతికించారు. గత రెండు నెలలుగా నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతోనే ఈ చర్య తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.



**పక్షపాత ధోరణిపై విమర్శలు**

అధికారుల చర్యలు నామమాత్రంగానే ఉన్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం సీజ్ చేసిన మూడంతస్థుల భవనం కేవలం మూడు నెలల క్రితమే ప్రారంభమైంది. కానీ, దాని పక్కనే గత పది నెలలుగా ఏడంతస్థుల భారీ అక్రమ నిర్మాణం కొనసాగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

**రూ. 20 కోట్ల విలువైన ఆక్రమణ**

స్థానిక రేషన్ దుకాణం సమీపంలో రోడ్డును ఆక్రమించి సాగుతున్న ఈ భారీ నిర్మాణాల వెనుక ఒక ముఠా ఉన్నట్లు తెలుస్తోంది. సుమారు 20 కోట్ల రూపాయల విలువైన ఈ అక్రమ కట్టడాలపై స్థానికులు నిరంతరాయంగా ఫిర్యాదులు చేస్తున్నా, ఉన్నతాధికారులు మాత్రం మౌనం వహిస్తున్నారు.

**జవాబుదారీతనం ఎక్కడ?**

ఏడంతస్థుల భవనాన్ని వదిలేసి, చిన్న భవనాన్ని సీజ్ చేయడం ద్వారా అధికారులు ఎవరిని కాపాడాలని చూస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ విషయమై డీసీపీ, ఏసీపీలను వివరణ కోరగా వారు స్పందించడానికి నిరాకరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆ ఏడంతస్థుల భవనానికి కూడా సీజ్ ఆర్డర్లు జారీ చేస్తేనే అధికారుల చిత్తశుద్ధి నిరూపితమవుతుందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఫాంహౌస్ పాలసీ

(మొదటి పేజీ తరువాయి)

నగరం బయటికి వెళ్లి ఫాంహౌస్‌లలో సేద తీరుతున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ నగరం చుట్టుపక్కల వేల సంఖ్యలో ఫాంహౌస్‌లు ఉన్నాయి. కొన్ని చాలా ఏళ్ల క్రితమే నిర్మితం కాగా.. మరికొన్ని ఇటీవలి కాలంలో పుట్టుకొచ్చాయి. అయితే మన రాష్ట్రంలో ఫాంహౌస్‌ల నిర్మాణానికి పర్మిషన్లు, విధి విధానాలు అంటూ ప్రత్యేకంగా ఏమీ లేవు. ఈ నేపథ్యంలోనే దీనిపై రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే ఫాంహౌస్ నిర్మాణాలకు ప్రత్యేక విధానాన్ని తీసుకువచ్చేందుకు సిద్ధమైంది.

**నిబంధనలు లేవ్**

ఇప్పటి వరకు ఫాంహౌస్‌లను నిర్మించుకునేందుకు ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో అడ్డగోలుగా నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే సమగ్ర ఫాంహౌస్ పాలసీని తీసుకువచ్చి.. వాటిపై నియంత్రణ తీసుకురావడంతో పాటు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి సంబంధించి విధివిధానాలు, ఫీజులు, అభివృద్ధి ఛార్జీలపై సంబంధిత అధికారులు కసరత్తు ప్రారంభించారు.

**జోన్ పరిమితులు లేకుండా..**

కన్వర్షన్, బయో కన్వర్షన్, కమర్షియల్, ఇండస్ట్రియల్ జోన్లలో కూడా ఫాంహౌస్‌లకు అనుమతులు ఇవ్వాలని రేవంత్ సర్కార్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఉన్న విధానాలను అధ్యయనం చేసి.. ఆ తర్వాత వీటికి సంబంధించి విధివిధానాలను ఫైనల్ చేయనున్నారు. ఈ ఫాంహౌస్ పాలసీ అమలుతో రాష్ట్ర ప్రభుత్వానికి నిర్మాణం, అభివృద్ధి ఫీజుల రూపంలో ఆదాయం పెరగనుందని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. కరోనా మహమ్మారి తర్వాత ఫాంహౌస్‌లకు వెళ్లడంపై మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి కుటుంబాలు బాగా ఆసక్తి చూపిస్తున్నాయి. వీకెండ్ సేద తీరేందుకు ఫాంహౌస్‌లను వెళ్లే వారి సంఖ్య భారీగా పెరిగింది. అయితే ప్రస్తుతం 100, 200 గజాల్లో కూడా ఫాంహౌస్‌లు నిర్మిస్తున్నారు. ఇలా చిన్న చిన్న స్థలాల్లో ఫాంహౌస్ నిర్మించి.. ఆ భూములను గుంటల లెక్కన రిజిస్ట్రేషన్లు చేస్తూ అక్రమాలకు తెరతీస్తున్నారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతుల వ్యవస్థ స్పష్టంగా లేకపోవడంతో బిల్డర్లు ఇష్టం వచ్చినట్లు నిర్మాణాలు చేపడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**నగరం చుట్టూ..**

హైదరాబాద్ నగరం బయట మొయినాబాద్, చేవెళ్ల, శంషాబాద్, శంకర్‌పల్లి, కందుకూరు, ఘట్‌కేసర్, మేడ్చల్ ప్రాంతాల్లో భారీగా ఫాంహౌస్ లేఅవుట్లు పుట్టుకొస్తున్నాయి. చట్టపరంగా మాత్రం ఆ భూములు ఇప్పటికీ వ్యవసాయ భూములుగానే పరిగణించడం గమనార్హం. నిబంధనలు కొత్తగా తీసుకొచ్చే పాలసీ ప్రకారం తక్కువలో తక్కువగా ఫాంహౌస్ నిర్మించాలంటే 1,200 చదరపు గజాల స్థలం ఉండాలి. ఆ ఫాంహౌస్‌కు కనీసం 30 అడుగుల వెడల్పైన రోడ్డు తప్పనిసరిగా ఉండాలి. మొత్తం స్థలంలో కేవలం 20 శాతం మాత్రమే కాంక్రీట్ నిర్మాణానికి అనుమతి ఉంటుంది. 1,200 చదరపు గజాల స్థలంలో 240 గజాల విస్తీర్ణంలో జీ ప్లస్ వన్ బిల్డింగ్ నిర్మించవచ్చు. మిగిలిన భూమిని పండ్ల తోటలు, కూరగాయల సాగుకు ఉపయోగించాలి. భవనం ఎత్తు 6 మీటర్లకు మించకూడదు. ఫాంహౌస్‌లు నిర్మించడం చట్టబద్ధం చేయడంతో పాటు అక్రమాలకు అడ్డుకట్ట వేయడం, ఆదాయాన్ని పెంచుకోవడం, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడమే పాలసీ లక్ష్యంగా సర్కర్ అడుగులు వేస్తోంది.

# మార్చి 20న రాష్ట్ర బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

పేరును ఇకపై 'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్'గా మారుస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మార్పుతో పాటు, ఇప్పటివరకు పరిషత్ పరిధిలో ఉన్న ఉద్యోగులను పూర్తి స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని నిర్ణయించారు. దీంతో వేలాది మంది వైద్య సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. రాజకీయ పార్టీల బలోపేతానికి సంబంధించి కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల నిర్మాణానికి భూమిని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మరికొన్ని కీలక భూ కేటాయింపులపై కూడా కేబినెట్ స్పష్టతనిచ్చింది. ఖమ్మం జిల్లాలో టీటీడీ ఆలయ నిర్మాణం లేదా ఇతర ఆధ్యాత్మిక సేవల కోసం 20 ఎకరాల భూమిని కేటాయించారు. మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరులో కొత్తగా జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణానికి గాను 70 ఎకరాల భారీ కేటాయింపుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరిపాలనా సౌలభ్యం కోసం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి తీసుకున్న ఈ నిర్ణయాలు అమలులోకి రానున్నాయి.



**కేంద్ర కులగణనకు ఓకే**

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన జన గణన ప్రక్రియను తెలంగాణలో చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ భారీ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నది. దానికనుగూణంగా అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఈ సమావేశంలో ముఖ్యంగా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన తొలి విడత ఇండ్ల గణన (హౌజ్ లిస్టింగ్ ఆపరేషన్) అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు ఈ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను కేబినెట్‌కు వివరించారు. మే 11న ఈ గణనను ప్రారంభించి జూన్ 9వ తేదీ వరకు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మరోవైపు ఈ హౌజ్ లిస్టింగ్ ప్రక్రియ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్దేశించిన 34 ప్రశ్నలతో కూడిన నమూనా పత్రాన్ని ప్రభుత్వం వినియోగించనుంది. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించేందుకు సుమారు 84 వేల మంది ఎన్యుమరేటర్లను, వారికి దిశానిర్దేశం చేసేందుకు నోడల్ ఆఫీసర్లను కలిపి మొత్తం 89 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులను ఈ విధుల్లో భాగస్వాములను చేయనున్నారు. తొలి దశ విజయవంతంగా ముగిసిన తర్వాత, అసలైన రెండో దశ జన గణన ప్రక్రియను వచ్చే ఏడాది అంటే 2027 ఫిబ్రవరిలో చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల అంచనాకు ఈ గణన ఎంతో కీలకం కానున్న నేపథ్యంలో, ఎలాంటి లోపాలు లేకుండా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

**'మెట్రో' స్వాధీనం**

హైదరాబాద్ మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఇప్పటికే దీనిపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. స్వాధీనం చేసుకునే ప్రక్రియను పర్యవేక్షించడానికి మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఈ కమిటీలో.. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు సభ్యులు. గత ఏడాది సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా ఎల్‌అండ్‌టీకి చెల్లించేలా.. రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకునేలా అవగాహనకొచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాతే స్వాధీన ప్రక్రియ మొదలైంది. మెట్రో ఆస్తులు, వాటి విలువను ఐడీబీఐ క్యాపిటల్.. రైళ్లు, ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థ వంటి సాంకేతిక అంశాలపై డీఎంఆర్‌సీ మదించి ప్రాథమిక నివేదికలిచ్చాయి.

# పంచాయితీరాజ్ ప్రక్షాళన?

(మొదటి పేజీ తరువాయి)

**ప్రతిపాదన వివరాలు?**

ప్రస్తుత విధానంలో ఓటర్లు నేరుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీలను ఎన్నుకుంటారు. వారు కలిసి మండల ప్రెసిడెంట్, జెడ్పీ చైర్మన్లను ఎన్నుకుంటారు. కానీ కొత్త ప్రతిపాదన ప్రకారం ప్రజల ద్వారా నేరుగా ఎన్నికైన సర్పంచ్‌లే తమలో ఒకరిని మండల పరిషత్ అధ్యక్షుడిగా (ఎంపీపీ) ఎన్నుకుంటారు. ఎన్నికైన ఎంపీపీలందరూ కలిసి జిల్లా పరిషత్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు.

**గత చరిత్ర**

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1980ల మధ్యకాలం వరకు ఇంచుమించు ఇలాంటి పద్ధతే ఉండేది. అయితే, 1994లో పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు తెచ్చిన 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 3 అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో ప్రత్యక్ష ఎన్నికల విధానం (ఎంపీటీసీ/జెడ్పీటీసీ) బలపడింది. తర్వాతి కాలంలో, 2000వ దశకంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ విధానం వల్ల నిధుల దుర్వినియోగం జరుగుతోందని, సర్పంచ్‌లకు ప్రాధాన్యత తగ్గుతోందని భావించారు. ఎంపీటీసీల వ్యవస్థను రద్దు చేసి, సర్పంచ్‌లకే అధికారాలు ఇవ్వాలని ఆయన ప్రతిపాదించారు. కానీ కొన్ని రాజకీయ, సాంకేతిక కారణాల వల్ల అది అప్పట్లో కార్యరూపం దాల్చలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్థానిక సంస్థల బలోపేతంపై దృష్టి పెట్టింది.



**నిధుల ఆదా**

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అయ్యే భారీ ఖర్చును తగ్గించవచ్చు. సర్పంచ్‌లకు గౌరవం గ్రామంలో కీలకమైన సర్పంచ్‌లకు మండల స్థాయిలో నిర్ణయాధికారం లభిస్తుంది. వారు సూపర్ పవర్ గా ఎదగడం వల్ల గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు ఎక్కువ తెచ్చుకునే అవకాశం ఉంటుంది. గ్రామ పరిపాలనలో జోక్యం తగ్గుతుంది.

**రాజకీయ సమీకరణాలు**

అయితే ఈ విధానం ప్రవేశ పెట్టడం ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ పట్టు పెంచుకోవడానికి ఇది సరైన మార్గమని ప్రభుత్వం భావిస్తోంది. క్యాబినెట్ సమావేశంలో ఈ మూడంచల విధానంలో మార్పులపై చర్చ జరిగినట్లు తెలిసింది. ఒకవేళ క్యాబినెట్ ఆమోదం తెలిపితే, రాబోయే స్థానిక ఎన్నికలు సరికొత్త పద్ధతిలో జరిగే అవకాశం ఉంది. ఈ మార్పు జరిగితే మండలాల్లో ఎంపీటీసీల పెత్తనం పోయి, సర్పంచ్‌లే కింగ్ మేకర్లు అవుతారు. అధికార వికేంద్రీకరణ జరుగుతుందా లేక రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న మార్పా అనేది వేచి చూడాలి.

# ఢిల్లీలో ఆలయాల పేల్చివేతకు కుట్ర

**ముద్ర డెస్క్:** ఢిల్లీలోని చాందినీచౌక్ మెట్రో స్టేషన్ వద్ద పది పిల్లర్లపై పోస్టర్లు వెలిశాయి. వీటిని మొదట ఎరవూ పట్టించుకోలేదు. కానీ మెట్రో భద్రతా సిబ్బంది గమనించారు. ఎర్రకెట వద్ద ఉన్న మందిరాలను పేచ్చేస్తామని హెచ్చకించారు. వెంటనే మెట్రో పోలీసులు సీసీ టీవీ ఫుటేజ్‌ను పరిశీలించి ఇద్దరిని గుర్తించారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం ఇచ్చారు. వారి కోసం గాలింపు మొదల పెట్టారు. వీరు పశ్చిమ బెంగాల్‌లో పట్టుబడ్డారు.

**తీగ లాగితే..**

పది మెట్రో పిల్లర్లపై ఎర్రకోట సమీప మందిరాలపై దాడి హెచ్చరికలు అంటించిన వీరిని సీసీటీవీ ద్వారా గుర్తించారు. పశ్చిమ బెంగాల్‌లో పట్టుకున్న ఉమర్ ఫారూఖ్ (మాల్దా స్థిరికుడు), రబూల్ ఇస్లాం (బంగ్లాదేశీ) ప్రశ్నల్లో బంగ్లాదేశ్ ఆధారిత హ్యాండ్లర్ షబీర్ అహ్మద్ లోన్ ఆదేశాలు అని చెప్పారు. ఈ లష్కర్ ఉగ్రవాది పాకిస్తాన్ నుంచి ఆపరేట్ చేస్తూ ఢిల్లీలో పేలుళ్లు ప్లాన్ చేశాడు.

**విస్తృత కుట్ర ప్లాన్..**

బంగ్లాదేశ్‌లోని ఒక హాండ్లర్ ఆదేశాల మేరకు పనిచేశామని చెప్పారు. ఆహాండ్లర్ పేరు షబీర్ అహ్మద్ లోన్. అంటే కశ్మీరీ ముస్లిం అన్న మాట. కశ్మీర్‌లో ఉగ్రవాదానికి పాల్పడి 2007లో అరెస్ట్ అయి. బెయిల్‌పై బయటకు వచ్చి పాకిస్తాన్ పారిపోయాడు. పాకిస్తాన్‌లో లష్కర్ ఎ తోయిబాతో కలిసి పనిచేస్తున్నాడు. ఇటీవల బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లోని ఇస్లామిక్ సంఘాలకు సంబంధాలు పెరిగాయి. ఈ సబీర్ అహ్మద్ లోన్ బంగ్లాదేశ్ వెళ్లాడు. అక్కడి నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నాడు. తమ మిత్రులు ఢిల్లీలో పేలుళ్లు జరుపబోతున్నట్లు వెల్లడించారు.



**గార్మెంట్స్‌లో కార్మికులుగా..**

తమిళనాడు తిరుప్పూర్‌లో గార్మెంట్స్ కార్మికులుగా ఉన్న ఏడుగురు మహ్మద్ లీటర్, ఉజ్జల్, జాహిద్, జాహిదుల్ ఇస్లాం, రహమాన్, ఉమర్, ఉమర్ ఫారూఖ్‌అరెస్ట్ అయ్యారు. వీరి ఫేక్ ఆధార్ కార్డులు, 16 సిమ్‌కార్డులు, నకిలీ డాక్యుమెంట్లు సేకరించారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, అస్సాంలో ఫేక్ ఐడీల ఫ్యాక్టరీలు గుర్తించబడ్డాయి, రోహింగ్యాలకు పాస్‌పోర్టులు కూడా అందించారు.

**కశ్మీర్ నుంచి బంగ్లాదేశ్ వరకు..**

కశ్మీర్ మూలాల ఉగ్రవాది పాకిస్తాన్–బంగ్లాదేశ్ లింక్‌ల ద్వారా దక్షిణ భారతానికి వ్యాప్తి చేసిన ఈ నెట్‌వర్క్ దేశ భద్రతకు సవాలుగా మారింది. బంగ్లాదేశ్ కూలీలు, కార్మికుల రూపంలో దాగి కుట్రలు రచిస్తున్నారు. 2022 దర్భంగా రైల్వే పేలుడు లాంటి సంఘటనలు ఈ ప్యాటర్న్‌ను గుర్తుచేస్తున్నాయి. ఇటీవల ఆసిమ్ మునీర్ కూడా ఈ ప్రకటన చేశారు. తూర్పు నుంచి దాడికి ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కుట్రతో అది బట్టబయలైంది. అక్రమంగా దేశంలోకి ప్రవేశించి ఇక్కడ పనిచేస్తూ కుట్రలు చేస్తున్నారు. తెలియక కొందరు తెలిసి కొందరు కుట్రలో భాగమయ్యారు. పోలీసు వేగప్రతిస్పందన దాడులను అడ్డుకుంది, కానీ అక్రమ వలసలు, ఫేక్ డాక్యుమెంట్ల సమస్యలు లోతుగా ఉన్నాయి. తీవ్రమైన వెరిఫికేషన్, అంతార్జాతీయ సహకారం అవసరం. ఈ ఎకోసిస్టమ్‌ను ధ్వస్తం చేయాలంటే బహుళ శాఖల సమన్వయం తప్పనిసరి.

# అక్రమ వలసదారులకు చుక్కలు

**ముద్ర డెస్క్ :** భారత దేశ ఈశాన్య రాష్ట్రాల్లో అస్సాం చాలా కీలకం ఈ ఏడాది రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మా రాష్ట్ర భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. బంగ్లాదేశ్ అక్రమ వలసలపై దృష్టి పెట్టి, స్థానిక సంస్కృతిని కాపాడేందుకు చర్యలు ప్రవేశపెడుతున్నారు.

**చొరబాటుదారులకు వ్యతిరేకంగా..**

హిమంత బిశ్వ శర్మా అస్సామ్‌లోని 'మోదియా' (స్థానిక అస్సామియా ముస్లింలు) 'మియా' (బంగ్లా మూలాల వలసలు) మధ్య వ్యత్యాసాన్ని స్పష్టం చేస్తూ, మాత్రమే అక్రమ చొరబాటుదారులపై లక్ష్యంగా పోరాడుతున్నారు. ఇది రాష్ట్ర ఉనికిని రక్షించేందుకు ఇతర వర్గాల సమన్వయాన్ని ప్రోత్సహిస్తోంది, విమర్శలను పట్టించుకోకుండా ముందుకు సాగుతున్నారు. స్థానికుల భూముల ఆక్రమణలను అరికట్టడానికి కఠిన చట్ట అమలు ద్వారా భద్రతా పరిస్థితులు మెరుగవుతున్నాయి.

**బాల్య వివాహాలపై కఠిన చర్యలు**

రాష్ట్ర ప్రభుత్వం బాల్య వివాహాల నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తోంది. ఫిబ్రవరి 21న విడుదలైన గణాంకాల ప్రకారం, 18 ఏళ్లకు ముందు జరిగే వివాహాలు 84 శాతం, 21 ఏళ్లకు ముందు అబ్బాయిల వివాహాలు 91 శాతం తగ్గాయి. చైల్డ్ ప్రెగ్నెన్సీలు 75 శాతం డౌన్ అవ్వడంతో పాటు, నిందితులపై 95 శాతం కేసుల్లో చార్జ్‌షీట్లు దాఖలవుతున్నాయి. తల్లిదండ్రులు, వివాహం జరిపినవారిపై జరిమానాలు, జైలు శిక్షలు విధించడం ద్వారా సామాజిక మార్పు సృష్టించారు, బంగ్లా మూలాల కుటుంబాల్లో ఆందోళన నెలకొంది.

ఈ చర్యలు అస్సాం జనాభా సమతుల్యతను మెరుగుపరచి, స్థానికుల హక్కులను బలోపేతం చేస్తున్నాయి. విమర్శకులు మతపరమైన విభజన అని చెప్పినా, ముఖ్యమంత్రి దీన్ని రాష్ట్ర రక్షణ పోరాటంగా చిత్రీకరిస్తున్నారు. ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి, భవిష్యత్తులో మరిన్ని సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది.



# బాల్క సుమన్ కు బెయిల్

**ముద్ర డెస్క్:** మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జరిగిన ఘటనల్లో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌పై ఆదిలాబాద్ జైలుకు తరలించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బాల్క సుమన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై జిల్లా ప్రధాన న్యాయస్థానంలో సోమవారం విచారణ జరిగింది. వాదనలు విన్న న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. మరోవైపు బాల్క సుమన్‌ను తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ.. పోలీసులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. కస్టడికి ఇవ్వాల్సిన అవసరం లేదని బాల్క సుమన్ తరుపున న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేస్తూ వాదనలు వినిపించారు. దీనిపైనా విచారణ మంగళవారానికి వాయిదా పడింది.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
24.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఆరోగ్యకరమైన అలవాట్లు**

**తగినంత నీరు తాగడం**
రోజుకు కనీసం 2–3 లీటర్ల నీరు తాగడం శరీరానికి అవసరం. ఇది డిటాక్స్ చేయడంలో, శక్తి నిల్వలో సహాయపడుతుంది.



# రోహిత్ వేముల చట్టం తెస్తాం

- **కాంగ్రెస్ ను కనుమరుగు చేసేందుకు బీజేపీ కుట్ర**
- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో రోహిత్ వేముల చట్టం తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. దేశానికి స్వాతంత్రం సాధించడంతో పాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధించేందుకు అనేక విప్లవాత్మక చట్టాలు చేసిన కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని తెలిపారు. స్వాతంత్రం ముందు నుంచి దేశంలోని రుగ్మతల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న కాంగ్రెస్ పార్టీని దేశంలో లేకుండా చేసేందుకు బీజేపీ.. కాంగ్రెస్ ముక్త భారత్ చేస్తాం, రాజ్యాంగాన్ని మారుస్తాం అంటుందన్నారు. ఈ సమాజం సామాజికంగా, ఆర్థికంగా విభజన జరిగి ఇలాగే ఉండాలని కొన్ని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయని తెలిపారు. కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవం, తాను కుల వివక్షను ఎదుర్కున్నానని



వివరించారు. వికారాబాద్ లో జరుగుతున్న ఏపీ, తెలంగాణ జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో సోమవారం ఆయన మాట్లాడారు. కుల సమస్యలు, రిజర్వేషన్లు, కాంగ్రెస్ వాదిగా కుల వివక్ష నిర్మూలనకు ఎలా పోరాటం చేయాలి అన్న అంశంపై భట్టి వారికి దిశానిర్దేశం చేశారు. దేశంలో అంటరానితనం, వివక్ష సమస్య ఎక్కడ ఎదురైనా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షం అవుతారన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల కుల వివక్షను భరించలేక బలవన్మరణానికి పాల్పడితే రాహుల్ గాంధీ నేరుగా యూనివర్సిటీకి చేరుకొని విద్యార్థులతో చర్చించి పోరాట విధానాన్ని ఖరారు చేశారని తెలిపారు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను ఎవరిని కూడా యూనివర్సిటీలోకి రానివ్వలేదన్నారు. అంటరానితనం సమస్యను సమస్యగా చూడాలి తప్ప రాజకీయ జోక్యం ఉండకూడదు అన్నది రాహుల్ ఆలోచన అన్నారు. ఈ రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం రాగానే వనరులు సంపద సమానంగా పంచుతామని ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ప్రకటించారు. ఆయన ప్రకటించినట్టుగా అధికారంలోకి రాగానే ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశ స్వాతంత్రం అనంతరం ఎక్కడా జరగని కులగణనను ప్రజా ప్రభుత్వం 50 రోజుల్లో పూర్తి చేసి శాసనసభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావడం, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ను పూర్తిగా అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారానే సాధ్యమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయ కరణ ద్వారా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక స్వాతంత్రం లభించిందని తద్వారా సామాజిక వివక్షను ఎదుర్కొనేందుకు చేయూత లభించిందని డిప్యూటీ సీఎం వివరించారు. లోక్ సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకోవడం ద్వారా రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయ్యేంత వరకు అన్ని జిల్లాల పార్టీ అధ్యక్షులు అంకిత భావం, చిత్తశుద్ధితో పని చేయాలని ఏపీ, తెలంగాణ డీసీసీలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డాక్టర్ వంశీ చందర్ రెడ్డి, ఏ ఐ సి సి నాయకులు విశ్వనాథన్, సావంత్, సచిన్ రావు తదితరులు పాల్గొన్నారు.




# గోవర్ధనుడిగా నర్సిహుడు సింహ వాహన సేవలో భక్తులకు దర్శనం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

బ్రహ్మోత్సవాలలో సోమవారం ఆరో రోజు ఉదయం ఆలయంలో నిత్యారాధనల అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని గోవర్ధనగిరిధారి అలంకార శేవలో అలంకరించి భక్తుల దర్శనార్థం తిరువీధులలో ఊరేగింపు వేడుక నిర్వహించారు. ఈ వేడుకలను శ్రీ పాంచరాత్రాగమ శాస్త్రానుసారముగా ఆలయ ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేదపండితులు, అర్చకబృందం, పారాయణీకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి జె. భవాని శంకర్, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహామూర్తి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరు ఎమ్. హనుమంతరావులు స్వామివారిని దర్శించుకుని గోవర్ధనగిరి ధారి అలంకార శేవ విశిష్టతను ప్రధాన అర్చకులు వివరించారు.

**సింహవాహనంపై స్వామివారు**

రాత్రి శ్రీ స్వామివారిని "సింహవాహన" శేవలో అలంకరించి తిరువీధులలో భక్తుల దర్శనార్థం ఊరేగించారు. ఈ వేడుకను ఆలయ ప్రధాన అర్చకులు, ఉప ప్రధానార్చకులు, యజ్ఞచార్యులు,వేద పండితులు, అర్చక బృందం, పారాయణీకులు అత్యంత వైభవముగా ఊరేగింపు వేడుక నిర్వహించారు. సింహవాహన సేవ ప్రత్యేకతను వేద పండితులు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ధార్మిక, సాహిత్య, సంగీత




మహాసభలు (సాంస్కృతిక కార్యక్రమాలు) భక్తులను స్థానికులను అలరించాయి.

**ధార్మిక సాహిత్య సంగీత మా సభలు**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య మసనచెన్నప్ప నరసింహావతారంపై ఒక గంటసేపు ప్రసంగించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. పోతన భాగవతంలోని పద్యాలను గొంతెత్తి పాడి వినిపించారు. ప్రహ్లాదునివలె నేటిబాలబాలికలు సద్గుణాలను అలవర్చుకోవాలని తెలిపారు. ప్రహ్లాదుని విష్ణు భక్తిగొప్పదని అతనిని రక్షించడానికి, విష్ణువే స్వయంగా అవతరించాడని, భగవంతునికి కూడా భక్తులంటే ప్రేమ అని, పాపాత్ములను శిక్షించడానికి భగవంతుడు ఒక్కొక్క సారి మహాపురుషులను కూడా భూమి మీద జన్మింప జేస్తాడని, మహాపురుషుల అడుగు జాడల్లో మనం నడిచి, మన సంస్కృతినిపరిరక్షించుకోవాలన్నారు.



# 'గ్లోబల్ వాల్యూ క్రియేషన్ హబ్'గా హైదరాబాద్

- **యువతను 'రెడీ టూ వర్క్ ఫోర్స్'గా తీర్చిదిద్దుతాం**
- **గ్లోబల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం అభివృద్ధిపై ఫోకస్**
- **రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ఐటీ మాత్రమే కాకుండా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్, ఏరో స్పేస్, మాన్యుఫ్యాక్చరింగ్, ఫిన్ టెక్, డీప్ టెక్, రిటైల్ తదితర రంగాల్లోనూ హైదరాబాద్‌ను 'గ్లోబల్ వాల్యూ క్రియేషన్ హబ్'గా మార్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. అందుకోసం.. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను 'రెడీ టూ వర్క్ ఫోర్స్'గా తీర్చిదిద్దడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే గ్లోబల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సోమవారం నానక్ రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో అంతర్జాతీయ బీమా దిగ్గజం హార్ట్ ఫోర్డ్ 1.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 1200 మంది ఉద్యోగుల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన 'ది హార్ట్ ఫోర్డ్ ఇండియా టెక్నాలజీ సెంటర్‌ను ఆయన ప్రారంభించి.. మాట్లాడారు. అంతర్జాతీయ విస్తరణలో భాగంగా రెండు శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన హార్ట్ ఫోర్డ్ హైదరాబాద్‌ను ఎంపిక చేసుకోవడం ఇక్కడి ప్రతిభకు, డిజిటల్ ఇంజినీరింగ్‌లో మన నాయకత్వానికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్నామన్నారు. ఈ కేంద్రం ద్వారా ఏఐ, రిస్క్ ఇంటెలిజెన్స్‌తో కూడిన ఆధునిక బీమా రంగంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరుగుతుందన్నారు. నగరంలో ఇప్పటికే 400కు పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) సేవలు అందిస్తున్నాయన్నారు. ఈ జాబితాలో మారియట్, మెక్‌డొనాల్డ్స్, యూబీఎస్, డాజన్, వాన్‌గార్డ్, ఎలీ లిల్లీ, హెచ్ సీఏ హెల్త్ కేర్, సిటిజన్స్ బ్యాంక్ లాంటి దిగ్గజ సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయన్నారు. వీటిని కేవలం బ్యాక్ ఎండ్ ఆపరేషన్స్‌కు మాత్రమే పరిమితం చేయకుండా.. గ్లోబల్ వాల్యూ సెంటర్లుగా మార్చేలా అవసరమైన వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. పారదర్శక పాలన, సమర్థవంతమైన నాయకత్వం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో సంస్కరణలు, ఆధునిక డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి తదితర అంశాలు హార్ట్ ఫోర్డ్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణను తమ గమ్యస్థానంగా ఎంచుకునేందుకు దోహదపడుతున్నాయన్నారు. తాజాగా ప్రారంభించిన ఈ కార్యాలయం యూఎస్ లోని హార్ట్ ఫోర్డ్, చికాగో, షార్లెట్, కొలంబస్ లో ఉన్న టెక్నాలజీ కేంద్రాలకు అనుబంధంగా పని చేస్తూ.. ఏఐ, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, అడ్వాన్స్డ్ టెక్నాలజీ డెవలప్ మెంట్‌పై దృష్టి సారిస్తూ 'ఇంజనీరింగ్ ఎక్స్ లెన్స్ హబ్'గా పని చేస్తుందని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. ఈ కార్యక్రమంలో హార్ట్ ఫోర్డ్ ప్రెసిడెంట్ మోరిస్ టూకర్, చీఫ్ మార్కెటింగ్ అండ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ క్లైర్ బర్న్స్, సీఐవో శేఖర్ పన్నాల, హార్ట్ ఫోర్డ్ ఇండియా ఎండీ అండ్ హెడ్ సూర్య తమ్మిరాజు, సీటీవో ఇమ్రాన్ మాలిక్ పాల్గొన్నారు.



# కాంగ్రెస్ అంటే దోపిడీ

- **జరిమానాలు పెంచి, పోలీసులకు టార్గెట్లు**
- **అకౌంట్ల నుండి డబ్బులు కట్ చేసే నిర్ణయాన్ని మార్చుకోవాలి**
- **ఏడాదిలో రూ.108.33 కోట్ల నుంచి రూ. 275.05 కోట్లకు పెరిగిన చాలానా వసూళ్లు**
- **కేంద్రమంత్రి బండి సంజయ్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆటోమేటెడ్ దోపిడీ' కి తెరలేపిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. చలానాల మొత్తాన్ని నేరుగా బ్యాంకు ఖాతాల నుండి కట్ చేసే 'ఆటోడెబిట్' విధానంపై సీఎం చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పు పట్టారు. ముందుగా జరిమానాలు పెంచి, ఆపై పోలీసులకు టార్గెట్లు పెట్టి, ఇప్పుడు నేరుగా అకౌంట్ల నుండి డబ్బులు కట్ చేయాలని చూడటం 'ఆటోమేటెడ్ దోపిడీ' లా ఉందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయాలను పునరాలోచించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ట్రాఫిక్ చలాన్ల ఆదాయం భారీగా పెరగడంపై స్పందించిన బండి సంజయ్... రాష్ట్రంలో సాగుతుంది 'ప్రజా పాలన' కాదు.. 'పెనాల్టీ పాలన' అని సోమవారం ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. కేవలం ఏడాది కాలంలోనే చలానాల వసూళ్లు రూ. 108.33 కోట్ల నుంచి రూ. 275.05 కోట్లకు పెరగడాన్ని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. ఏడాది కాలంలోనే జరిమానాల ద్వారా వచ్చే ఆదాయం 154 శాతం అంటే దాదాపు 2.5 రెట్లు పెరిగిందని గణాంకాలతో వివరించారు. చలానాల ద్వారా వసూళ్లు 2.5 రెట్లు పెరిగినప్పుడు, రాష్ట్రంలో రోడ్లు కూడా అదే స్థాయిలో మెరుగుపడ్డాయా అని బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రోడ్లపై గుంతలు మాయమయ్యాయా, ట్రాఫిక్ నిర్వహణ ఏమైనా మెరుగైందా అని నిలదీశారు. ఎలాంటి మౌలిక వసతులు కల్పించకుండా కేవలం జరిమానాల పైనే ప్రభుత్వం దృష్టి పెట్టడం సరికాదన్నారు. సామాన్య ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక 'వాకింగ్ ఏటీఎం'లా వాడుకుంటోందని ఆయన ఆరోపించారు.




# విద్యను నిర్లక్ష్యం చేయొద్దు

- **బడ్జెట్ లో 20 శాతం నిధులు కేటాయించాలి**
- **ప్రొఫెసర్ కే.చక్రధర్ రావు**

**ముద్ర, తెలంగాణ:**

రాష్ట్ర బడ్జెట్ లో విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలని ప్రొఫెసర్ కే చక్రధర్ రావు అన్నారు. సోమవారం జరిగిన తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 12 సంవత్సరాల్లో ప్రభుత్వాలు విద్యకు బడ్జెట్లో నిధులు పూర్తిగా తగ్గించాయని అన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య 2021 22లో 27 లక్షల ఉంటే అది ప్రస్తుతం 16 లక్షలకు పడిపోయిందని చక్రధర్ రావు అన్నారు. వచ్చే ఐదు సంవత్సరాల్లో విద్యార్థుల సంఖ్య వేగంగా పడిపోయి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఒక్క శాతం కూడా మిగలరని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాజస్థాన్, బీహార్ కంటే కూడా విద్యకు మన రాష్ట్రంలో విద్యకు బడ్జెట్ లో తక్కువగా ఉందని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు కె.గోవర్ధన్ చెప్పారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు హనుమేష్ మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీలో 1267 ప్రొఫెసర్లు ఉండవలసిన చోట 936 పోస్టులు ఖాళీగా ఉన్నాయంటే యూనివర్సిటీ విద్య ఏ స్థాయిలో దిగజారిందో తెలుస్తుందని చెప్పారు. ఇదే సమావేశంలో ప్రొఫెసర్ శివారెడ్డి మాట్లాడుతూ.. విద్యా బడ్జెట్ తక్కువగా ఉండడం వలన అవసరం ఉన్నన్ని గదులు లేని పాఠశాలలు 13వేల వరకు ఉన్నాయని, పక్కా కాంపౌండ్ గోడలు లేనివి 13వేల వరకు ఉన్నాయని, అలాగే దాదాపు 20వేల స్కూల్లో సగటున ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. ఇటువంటి పరిస్థితులలో నాణ్యమైన విద్య అందడం అసాధ్యమని ఆయన చెప్పారు. ప్రొఫెసర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ.. 2024 ఆసర్ రిపోర్ట్ ప్రకారం ఎనిమిదో తరగతి విద్యార్థులు రెండో తరగతి పుస్తకం చదవలేకపోతున్నారంటే తెలంగాణలో విద్యా ప్రమాణాలు అత్యంత వేగంగా తగ్గిపోతున్నాయని అర్థమవుతుందని చెప్పారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్లో 20 శాతం నిధులు విద్యకు కేటాయించాలనే డిమాండ్‌ను తమ మద్దతు తెలుపుతున్నానని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు. ఎంవిఎఫ్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు ఆర్. వెంకట రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని చాలా పాఠశాలల్లో వందలాది మంది విద్యార్థులున్నా కూడా ఉపాధ్యాయులను నియమించకపోవడం దుర్మార్గమని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఐ నుండి స్టాలిన్, బాలల హక్కుల సంక్షేమ సంఘం నుండి ఇంజమూరి రఘునందన్, టి.పి.టి.ఎఫ్. నుండి తిరుపతి, డిటిఎఫ్ నుండి సోమయ్య తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ నుండి వై.అశోక్ కుమార్, ఎం.రఘు శంకర్ రెడ్డి, కె.రవిచందర్, ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణలు, టి.యు.సి.ఐ. నుండి కే ప్రదీప్, పిడియస్ యూ నుండి పి మహేష్ గురుకుల ఉపాధ్యాయ సంఘం నుండి సదానందం తదితరులు పాల్గొని మాట్లాడారు.

# అవాంతరాలను అధిగమిస్తాం

- **చిక్కులు పరిష్కార ప్రక్రియ మొదలు**
- **భూసేకరణ ప్రక్రియ వేగవంతం**
- **రైతులకు న్యాయపరమైన చెల్లింపులు**
- **జూన్ 2 కు ముందే భూసేకరణకు నిధులు**
- **ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

అనేక ఆవాంతరాలతో అర్ధాంతరంగా నిలిచి పోయిన గౌరెల్లి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అన్నివైపులా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపై నిధుల కేటాయింపుల్లో కుడా అలసత్వానికి అవకాశం లేకుండా ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. 1.06 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే లక్ష్యంతో మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టు పర్యావరణ అనుమతులతో పాటు న్యాయపరమైన చిక్కులు ఏర్పడ



డంతో పనులు మందగించాయన్నారు. తాజాగా ఆ అవాంతరాలను అధిగమించి ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచుతామన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో సహచర మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ఆయన సిద్దిపేట జిల్లా అక్కనపేట మండలంలో గౌరెల్లి ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అనేక ఆవాంతరాలతో అర్ధాంతరంగా నిలిచి పోయిన గౌరెల్లి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అన్నివైపులా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. వరద కాలువ ద్వారా వచ్చే నీటితో సిద్దిపేట జిల్లా అక్కనపేట మండలం గౌరెల్లి గ్రామంలో 1.41 టి.యం.సిల నీటితో ఈ రిజర్వాయర్ నిర్మాణం ప్రతిపాదించగా అంచనాలు సవరించి 8.23 టి.యం.సి ల సామర్థ్యానికి పెంచి అదనపు ఆయకట్టు సేద్యంలోకి తేవాలన్నది రాష్ట్ర ప్రభుత్వం సంకల్పమన్నారు. భూసేకరణ విషయంలో రైతులకు అందించే చెల్లింపులు న్యాయబద్ధంగా ఉండడంతో పాటు సకాలంలో నిధుల మంజూరుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆయన వెల్లడించారు. గౌరెల్లి ప్రాజెక్టుకు అవసరమైన నిధులను జూన్ 2 ముందే విడుదల చేస్తామని, సకాలంలో పూర్తి చేయాలని కరీంనగర్, జనగామ, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. న్యాయపరమైన అంశాలను ఎదుర్కొంటున్న గౌరెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన కేసు మరో రెండు రోజుల్లో విచారణకు రానుందన్నారు. రవాణా,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గౌరెల్లి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు నిరంతరం ఒత్తిడి పెంచుతున్నామని చెప్పారు. అందుకు సంబంధించిన భూసేకరణను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. పట్టణీకరణ వేగవంతంగా పెరుగుతున్న నేపథ్యంలో భూముల ధరలు పెరగడంతో రైతులు పెద్ద మొత్తంలో నష్టపరిహారం కోరుకుంటున్నారన్న మంత్రి... అందుకు సంబంధించిన విధాన నిర్ణయాలు న్యాయపరంగా తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో రాష్ట్ర నీటిపారుదల శాఖ సలహాదారుడు ఆదిత్య దాస్ నాథ్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆర్అండ్ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు, ఇ.ఎన్.సి జెనరల్ రమేష్‌బాబు లతో పాటు కరీంనగర్ జనగామ, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# పసిడి పరుగులు

**ముద్ర, తెలంగాణ:**

ప్రపంచంలో ప్రస్తుతం ఏం నడుస్తోంది అంటే.. బంగారం, వెండి ధరల పెరుగుదల నడుస్తోందని చెబుతున్నారు. ఏడాది క్రితం మొదలైన ఈ పెరుగుదల ప్రయాణం.. ఇంకా కొనసాగుతోంది. అప్పుడప్పుడు చిన్నచిన్న బ్రేక్‌లు పడుతున్నా.. పెరుగుదల మాత్రం ఆగడం లేదు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు గోల్డ్, సిల్వర్ నిల్వలు పెంచుకుంటున్నాయి. దీంతో పాటు యుద్ధ భయాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పలు దేశాల బ్యాంకులు గోల్డ్, సిల్వర్ నిల్వలు పెంచుకుంటున్నాయి. దీంతో ధరలు భారీగా పెరుగుతున్నాయి.



**ధరల పెరుగుదల ఇలా..**
తాజాగా బంగారం వెండి ధరలు మళ్లీ పెరిగాయి.

హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ గోల్డ్ 10 గ్రాములకు రూ.2,070 పెరిగి రూ.1,61,350కు చేరింది. దీంతో ఇక సామాన్య, మధ్య తరగతి ప్రజలు బంగారం, వెండి కొనే పరిస్థితి లేదు. 22 క్యారెట్ పసిడి 10 గ్రాముల ధర రూ.1,900 పెరిగి రూ.1,47,900గా నిలిచింది. కేజీ వెండి ధర కూడా రూ.10 వేలు పెరిగింది. దీంతో రూ.3 లక్షలకు చేరింది. ఈ హెచ్చుతగ్గులు మార్కెట్‌లో ఆందోళన కలిగిస్తున్నాయి.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
సోమవారం 23.02.2026



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## న_కలం

## సొంతిల్లు వదిలి.. పొరుగు పంచాయితీ!

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఇప్పుడు ఒక వింతైన, విశ్లేషకులకు సైతం అంతుచిక్కని ధోరణి కనిపిస్తోంది. సాధారణంగా ఏ రాజకీయ పార్టీకైనా తన ఉనికి, తన సిద్ధాంతం, తన ఓటు బ్యాంకు ముఖ్యం. కానీ, తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగాన్ని గమనిస్తే, ఆ పార్టీ ప్రాధాన్యతలు మారుతున్నాయా? అన్న అనుమానం కలగక మానదు. సొంత రాష్ట్రంలోని సమస్యల కంటే, పొరుగు రాష్ట్ర రాజకీయాలపై ఆ పార్టీ డిజిటల్ సైన్యం చూపుతున్న శ్రద్ధ ఇప్పుడు రాజకీయ చర్చకు దారితీస్తోంది.

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో బీఆర్ఎస్ సోషల్ మీడియా అనుసరిస్తున్న వ్యూహం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షంగా ఉంటూ స్థానిక ప్రభుత్వంపై పోరాడాల్సింది పోయి.. ఆంధ్రప్రదేశ్‌లోని వైసీపీ కోసం 'ఓవర్ టైమ్' పనిచేయడం విడ్డూరంగా ఉంది.తిరుమల లడ్డూ వంటి ఏపీ అంశాల్లో టీడీపీని లక్ష్యంగా చేసుకుని, వైసీపీని వెనకేసుకొస్తుండటం వల్ల బీఆర్ఎస్ తన సొంత అస్తిత్వాన్ని కోల్పోతోంది. తెలంగాణ సమస్యలపై గళం విప్పాల్సిన సమయంలో పక్క రాష్ట్ర రాజకీయాల్లో తలదూర్చడం వల్ల పార్టీ గ్రాఫ్ పడిపోతోందని కార్యకర్తలు భావిస్తున్నారు.ఈ 'డిజిటల్ దోస్తీ' వల్ల అటు ఏపీలో వైసీపీకి, ఇటు తెలంగాణలో బీఆర్ఎస్‌కు వ్యతిరేక ఫలితాలు వచ్చే ప్రమాదం ఉంది.

సోషల్ మీడియా లైకులు ఓట్లుగా మారవు. బీఆర్ఎస్ తన శక్తిని సొంత రాష్ట్ర సమస్యలపై కేంద్రీకరించకుండా, పొరుగు రాష్ట్ర రాజకీయాల్లో వృధా చేయడం ఆత్మాహుతి సదృశమే.

## ముక్కుల రాజకీయం

(రాజకీయ వ్యంగం)

ముక్కోడు వచ్చాడు
మాటలతో కాదు
ముక్కుతోనే హామీలవాసన చూపిస్తూ.

ముక్కోపి వచ్చాడు
ఓటర్లు ప్రశ్నలు అడిగితే
ముక్కు ఎగిరేలా అరుస్తూ కరుస్తూ.

ముక్కుపచ్చలారనోడు వచ్చాడు
పేదల కన్నీటివాసన పట్టని చిరునేతగా,
తండ్రికి ప్రతినిధిగా వత్తాసు పలుకుతూ.

ముక్కుతో మాట్లాడేవాడు వచ్చాడు
నోరు తెరిస్తే నిజం జారిపోతుందనుకుని
నాసికతోనే నీతుల ఉపన్యాసం చేస్తూ.

కోటేరు ముక్కోడు వచ్చాడు
ఐదేళ్ల పాలనను
ఐదు నిమిషాల కథలా చెప్పేస్తూ.

చీమిడి ముక్కోడు వచ్చాడు
చీమంత తప్పుకే
దేశద్రోహం ముద్ర వేస్తూ.

ముక్కు మూసుకున్నవాడు వచ్చాడు
అవినీతి దుర్వాసన తనదాకా రాకుండా
ముక్కుమీద వేలు వేసుకుంటూ.

ముక్కును మూసేవాడు వచ్చాడు
ప్రజల ప్రశ్నలకు
మౌనానికి మాస్క్ వేస్తూ.

ముక్కును పగలకొట్టేవాడు వచ్చాడు
ఎదిరించిన ప్రతి ముక్కుపై
లాఠీల వర్షం కురిపిస్తూ.


ముక్కుకు ముక్కురాసేవాడు వచ్చాడు
గౌరవాన్ని పథకాల పేరుతో
కాగితాలకే కట్టేస్తూ.

ముక్కును నేలపైరాసేవాడు వచ్చాడు –
పాత తప్పులకు క్షమాపణ కోరుతూ,
కొత్త నాటకానికి తెరతీస్తూ.

ఎన్నికల మేడపై
ముక్కులే నాయకులయ్యాయి,
మనుషుల అవసరాలు పాదాల కింద పడేసాయి.

చివరికి ప్రజలు అడిగారు
"ముక్కు గెలిచింది...
కానీ మా ఊపిరి ఎప్పుడు గెలుస్తుంది? అని"

గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్,
భాగ్యనగరం.



## మేఘాలయలో ప్రపంచంలోనే మొట్టమొదటి
# వర్షపు మ్యూజియం




భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాలలో ఒకటైన మేఘాలయలోని ఖాసీ కొండలలో ఉన్న మౌసిన్‌రామ్ అనే గ్రామం భూమండలంపైనే అత్యంత తేమతో కూడిన ప్రదేశంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అత్యధిక సగటు వార్షిక వర్షపాతం కలిగిన ఈ గ్రామంలో వర్షపాతం 11,872 మిల్లీమీటర్లు (460 అంగుళాలకు పైగా) దాటి నమోదయ్యింది. ఈ ప్రాంతంలో రుతుపవనాల ప్రభావం కారణంగా తీవ్రమైన, స్థిరమైన వర్షపాతం నమోదవుతూ రికార్డు స్థాయిలో వర్షాలు కురుస్తాయి. సాధారణంగా ఏప్రిల్ మరియు అక్టోబర్ మధ్య ఈ ప్రాంతంలో ఎక్కువ వర్షం పడుతుంది. ఇక్కడికి కేవలం 15 కి.మీ దూరంలో ఉన్న చిరపుంజి (సోహ్రా) పట్టణం భూమిపై అత్యంత తేమతో కూడిన ప్రదేశాలలో ఒకటిగా గతంలో రికార్డును కలిగి ఉంది. అయితే, మౌసిన్‌రామ్ గ్రామం దాని అధిక సగటు కారణంగా ఈ ఘనతను దక్కించుకుంటుంది. మేఘాలయ ప్రభుత్వం 2026 నాటికి రు.35 కోట్ల అంచనా వ్యయంతో భారతదేశంలోనే కాక ప్రపంచంలోనే మొట్టమొదటి రెయిన్ మ్యూజియం నిర్మించేందుకు ప్రణాళికలు రచించి పెట్టుబడులు పెట్టింది. మేఘాలయ పర్యాటక మంత్రి పాల్ లింగ్డో ప్రకారం, మేఘాలయ బేసిన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్మించబడుతున్న ఈ మ్యూజియం స్థానిక జీవనశైలి, గృహనిర్మాణం మరియు దుస్తులు కూడా ప్రత్యకంగా నిరంతర వర్షపాతానికి అనుగుణంగా రూపొందించబడినందున, మౌసిన్రామ్‌ను ఒక ప్రత్యేక పర్యాటక ప్రదేశంగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకుంది. వర్షాకాలం చివరి నాటికి రెయిన్ మ్యూజియం మరియు పరిశోధన కేంద్రం నిర్మాణం పూర్తయ్యి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ మ్యూజియం వర్షపు విజ్ఞానాన్ని, స్థానిక ఖాసీ సంస్కృతిని, వెదురు ఆధారిత నిర్మాణ శైలిని ప్రదర్శిస్తూ, పర్యాటకాన్ని పెంచేలా రూపొందిస్తున్నారు. ఈ ప్రదేశానికి ఎక్కువ మంది పర్యాటకులను ఆకర్షించడం వలన ఉపాధి అవకాశాలు పెరుగడంతో పాటు స్థానికుల జీవన పరిస్థితులు మెరుగుపడతాయని మేఘాలయ ప్రభుత్వం భావిస్తోంది.

### మేఘాలయ రైన్ మ్యూజియం ముఖ్య విశేషాలు:

వెదురుతో (బాంబూ) కూడిన ఆధునిక పర్యావరణ అనుకూల నిర్మాణం ఈ మ్యూజియం ప్రత్యేకత. మేఘాలయలోని వర్షాధార ప్రాంతంలో ఏర్పాటవుతున్న రెయిన్ మ్యూజియంలో వర్షం ఎలా ఏర్పడుతుంది, పర్యావరణ వ్యవస్థలను ఎలా రూపొందిస్తుంది అనే అంశాలతో పాటు మేఘాలయ రాష్ట్రంలో ఎందుకు అసాధారణ వర్షపాతం పొందుతుంది అనేవి ప్రదర్శించబడతాయి. ప్రదర్శనలలో పరస్పర ప్రభావశీల వ్యవస్థ (ఇంటరాక్టివ్) ద్వారా శాస్త్రీయ ప్రదర్శనలు, భౌగోళిక మరియు వాతావరణ వివరణలు, సాంస్కృతిక కళాఖండాలు, సహజ దృగ్విషయాలు మరియు స్థానిక సమాజాలు వర్షంతో కలిగి ఉన్న లోతైన సంబంధాన్ని వివరించే కథనాలతో కూడిన అంశాలు ఉంటాయి. శాస్త్రానికి మించి, మ్యూజియం వర్షం మరియు రుతుపవనాల చుట్టూ పెనవేసుకున్న స్థానిక గిరిజన సంస్కృతులు, సంప్రదాయాలు, సంగీతం మరియు జానపద కథల పట్ల సందర్శకులకు గొప్ప అనుభూతిని కలిగించేందుకు కృషి చేస్తుంది. వర్షపాతం రాష్ట్రంలో రోజువారీ జీవితం, వ్యవసాయం మరియు సాంస్కృతిక వ్యక్తీకరణలను ఎలా ప్రభావితం చేస్తుందో ఈ మ్యూజియాన్ని సందర్శించడం ద్వారా పర్యటకులకు అవగాహన కలుగుతుంది. ఇది విద్య మరియు సాంస్కృతిక వారసత్వం యొక్క మిశ్రమ అనుభవంగా మారుతుంది. ఈ మ్యూజియం ఏర్పాటుతో మేఘాలయ ఒక గొప్ప ప్రపంచ పర్యాటక ఆకర్షణగా మారనుంది. నిర్మాణం పూర్తయిన తర్వాత, మ్యూజియంలో ఏర్పాటయ్యే అత్యాధునిక పర్యవేక్షణ పరికరాలతో పాటు భారత వాతావరణ శాఖ (ఐఎండి) మరియు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో సంభావ్య సహకారాలతో కూడిన అత్యాధునిక పరిశోధన సౌకర్యం అందుబాటులోకి రానుంది.

### ఇతర వర్షాధార ప్రాంతాలకంటే భిన్నం:

హవాయి లేదా లా రీయూనియన్ వంటి అధిక వర్షపాతం ఉన్న ప్రాంతాలు మహాసముద్రాలు మరియు ప్రభావిత తుఫాను వ్యవస్థలతో చుట్టుముట్టబడిన ద్వీపాలు. అయితే సోహ్రాలో వర్షపాతం అందుకు భిన్నంగా ఒక ప్రత్యేకమైన ప్రక్రియ ద్వారా సంభవిస్తుంది. బంగాళాఖాతం నుండి తేమతో కూడిన మేఘాలు, బంగ్లాదేశ్ యొక్క లోతట్టు మైదానాలను దాటిన తర్వాత, ఖాసీ కొండల దక్షిణ అంచున దాదాపు 4,500 అడుగుల ఎత్తుకు అకస్మాత్తుగా పెరుగుతాయి. ఈ ఆకస్మిక ఆరోహణ, ఈ ప్రాంతంలో తీవ్రమైన సంక్షేపణం మరియు కుండపోత వర్షానికి కారణమవుతుంది. రెయిన్ మ్యూజియం శాస్త్రవేత్తలకు మాత్రమే కాకుండా రోజువారీ సందర్శకులకు కూడా ఈ దృగ్విషయాన్ని అర్థం చేసుకోవడానికి అవకాశం కల్పిస్తుంది.


### ఈ మ్యూజియం ఎందుకు ?

**మ్యూజియంలో వాతావరణ కేంద్రం కూడా ఉండడంతో, వర్షం, మేఘాలు, వాతావరణ మార్పులు (క్లైమేట్ చేంజ్), నీటి సంరక్షణ (వాటర్ కన్సర్వేషన్) వంటి అంశాలను శాస్త్రీయంగా, అనుభూతి పరంగా చూపించేలా ఈ ప్రాజెక్ట్ రూపొందించబడుతోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రపంచంలోనే మొట్టమొదటగా అందుబాటులోకి రానున్న ఈ రైన్ మ్యూజియం ద్వారా సందర్శకులకు వర్షపు చరిత్ర, వాతావరణ శాస్త్రం (మిటియోరాలజీ), పర్యావరణ పరిరక్షణపై (ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్) అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. ఈ మ్యూజియం కేవలం పర్యాటకులకు మాత్రమే కాకుండా, విద్యార్థులు మరియు పరిశోధకులను కూడా ఆకర్షించి వర్షం, వాతావరణ మార్పులు మరియు తదితర సంబంధిత విషయాలపై విస్తృత పరిశోధనలు చేపట్టేందుకు అవకాశం కల్పించే వేదికగా మారనుంది.**

### భూతల స్వర్గం:

ప్రకృతి ఔత్సాహికులకు మరియు సాహస యాత్రికులకు మౌసిన్రామ్ ఒక భూతల స్వర్గంగా అనిపిస్తుంది. ప్రశాంతమైన ఈ గ్రామంలో పచ్చని ప్రకృతి దృశ్యాలు, ఉత్కంఠభరితమైన జలపాతాలు మరియు ఆధ్యాత్మిక గుహలు ఉన్నాయి. నగరాలు మరియు పట్టణాల ఉరుకులు పరుగుల జీవితంతో విసిగి వేసారి, ఆటవిడుపు కోసం జనసమూహం నుండి దూరంగా అందాల ప్రకృతి ఒడిలో కొంత సమయం గడపాలనుకునే వారికి ఈ ప్రాంతం మధురానుభూతిని మిగులుస్తుంది. మౌసిన్రామ్ సందర్శించే పర్యాటకులు ఈ ప్రాంతంలోని అద్భుతమైన సున్నపురాయి గుహలను అన్వేషించడం, వర్షాధార జలపాతాలను వీక్షించడంతో పాటు పొగమంచు దారుల వెంట ట్రెక్కింగ్ చేయవచ్చు. స్థానిక ఖాసీ సంస్కృతిని అవగతం చేసుకుంటూ, సాంప్రదాయ వంటకాలను ఆస్వాదిస్తూ, గ్రామస్తుల హృదయపూర్వక ఆతిథ్యంతో తాదాత్మ్యం పొందవచ్చు. మౌసిన్రామ్ యొక్క అనాఘ్రాణిత సహజ సౌందర్యం మరియు ఆకర్షణ స్వచ్ఛమైన ప్రకృతి అనుభవాన్ని కోరుకునే వారికి దీనిని ఒక ప్రత్యేకమైన గమ్యస్థానంగా చేస్తాయి.

యేచన్ చంద్రశేఖర్
మాజీ రాష్ట్ర కార్యదర్శి
ది భారత్ స్కౌట్స్ & గైడ్స్,
తెలంగాణ
హైదరాబాద్
✆ 8885050822








# ఆరోగ్యమే మహా భాగ్యం

### బాలికల పౌష్టికాహారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

కస్తూర్బా విద్యాలయాల్లో(కేజీబీవీ) చదివే బాలికలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు కస్తూర్బా విద్యాలయాలను దేశవ్యాప్తంగా కేంద్రం నిర్వహిస్తున్నవి వీటి నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుంది. అయితే ఇటీవల కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో చదివే బాలికల ఆరోగ్యంపై ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో బాలికలు పౌష్టికాహారలోపంతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తేలింది. దీంతో ప్రభుత్వం బాలికలకు చదువుతో పాటు మంచి పోషకాహారం అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు గురుకుల విద్యాలయాల్లో మాదిరిగానే కేజీబీవీల్లో కూడా మెస్ చార్జీలను పెంచి విద్యార్థుల ఆహార మెనూలో మార్పులు చేసింది.

గతంలో కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో చదివే ఒక్కో విద్యార్థికి మెస్ చార్జీల కింద 1,225 రూపాయలు అందించగా, ఇప్పుడు దీన్ని 1,740రూపాయలకు పెంచారు. అంటే గతంలో కంటే 515 రూపాయలు మెస్ చార్జీలు పెంచారు.. దీని ప్రకారం కేజీబీవీ బాలికలు ఈ ఏడాది నుంచి కొత్త వంటలు రుచి చూస్తున్నారు. కొత్త మెనూ ప్రకారం నెలలో రెండుసార్లు మాంసాహారం, వారంలో ఐదుసార్లు గుడ్లు, ప్రతిరోజూ నెయ్యి వడ్డిస్తారు. కొత్త ఆహార మెనూ రూపొందించిన ప్రభుత్వం దీన్ని అమలు చేసే బాధ్యతను విద్యాశాఖకు అప్పగించింది. ప్రభుత్వ ఆదేశాలతో విద్యాశాఖ అధికారులు కొత్త మెనూ అమలు పరుస్తున్నారు. సమర్థవంతంగా అమలు చేయడానికి కొత్త వంటకాల తయారీపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు . అక్కడ శిక్షణ పొందిన వారితో జిల్లాలోని మిగితా వారందరికీ ప్రాంతాల వారీగా వంటకాల తయారీపై శిక్షణ ఇచ్చారు.

### మెనూ ఇలా....

**ఉదయం:** ఉప్మా, జీరా రైస్, పులిహోరా, టమాట కిచిడీ, రాగి జావ, సాంబారు. బూస్టు, పూరి, బోండా, వడ, చపాతి, అరటి పండు

**మధ్యాహ్నం:** టమాట పప్పుతో అన్నం, నెయ్యి, రసం, పెరుగు, ఉడకబెట్టిన గుడ్డు, చికెన్

**సాయంత్రం:** పకోడీ, ఉడకబెట్టిన శనగలు, ఎగ్‌బజ్జీ, బెల్లంపట్టీలు, అల్లం చాయ్, మిల్లెట్ బిస్కెట్లు

**రాత్రివేళ:** వివిధ రకాల కూరలతో అన్నం, మజ్జిగ, సాంబారు

### మారిన మెనూ..

ఈ పథకాన్ని అమలు చేసేందుకు స్కూళ్ల ప్రారంభం నుంచే పర్యవేక్షించాలని ఉన్నతాధికారులకు ప్రభుత్వం ఆదేశించింది. మారిన మెనూ పాఠశాలల అమల్లోకి వచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రతిరోజు మారే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఉదాహరణకు ఉదయం అల్పాహారం కింద సోమవారం ఉప్మా పెడితే మరుసటి రోజు ఇతర వంటకాల్లో ఏదైనా ఒకదాన్ని వడ్డిస్తారు. ఇలా రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి వివిధ రకాల రుచులతో వంటకాలు అందిస్తారు. కొత్తగా రూపొందించిన ఆహార పట్టిక విద్యాలయాల్లో నోటీసు బోర్డుపై పెట్టి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే బాలికల తల్లిదండ్రులకు కూడా దీనిపై శిక్షణ ఇచ్చారు జిల్లాల విభజన తర్వాత కొత్తగా ఏర్పాటైన మండలాల్లోనూ కేజీబీవీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సుమారు లక్షలాది కి పైగా విద్యార్థులు వివిధ పాఠశాలల్లో చదువుతున్నారు.దీని వల్ల కస్తూర్బా విద్యాలయాల్లో ప్రతి ఏటా ప్రవేశాల సంఖ్య పెరుగుతూ వస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వం కస్తూర్బా పాఠశాలల్లో కొత్త మెనూ అమలు చేయడం వరకు బాగానే ఉన్నా ఆయా పాఠశాలల్లో వంట చేస్తున్న వారికి వేతనాల పెంపుపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదని వంట కార్మికులు వాపోతున్నారు.ఒక్కో పాఠశాలలో సుమారు నాలుగు, నుంచి ఐదుగురు వంట మనుషులు పని చేస్తున్నారు. వారికి ఒక్కొక్కరికి నెలకు 9,500 రూపయాలు చెల్లిస్తున్నారు. ఈ వేతనం తమ కుటుంబ పోషణకు ఏ మాత్రం సరిపోవడం లేదని వాపోతున్నారు. దీనికితోడు కేజీబీవీల్లో కొత్త మెనూ అమలుతో తమకు మరింత భారం పెరిగిందని వాపోతున్నారు. ఇప్పటికే ఉదయం నుంచి రాత్రి వరకు పాఠశాలల్లో పని చేస్తున్నామని కొత్తగా అమల్లోకి తెచ్చిన మెనూతో మరింత భారంగా మారనుందని వంట మనుషులు వాపోతున్నారు. పనికి తగ్గ వేతనం కింద తమకు నెలకు 20 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

రాష్ట్ర ప్రభుత్వం కస్తూర్బా విద్యాలయాల్లో కొత్త మెనూ అమలుకు చర్యలు తీసుకుంది. బాలికలకు పౌష్టికాహారం అందించేందుకు రూపొందించిన మెనూ అన్ని పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు విద్యార్థుల చదువుతో పాటు మెరుగైన భోజనం అందించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఏ ఒక్కరూ పోషకాహార లోపం లేకుండా ఆరోగ్యంగా ఉండేందుకు చదువులో ముందు ఉండేందుకు ప్రభుత్వం కేజిబివిల బలో పేతంకు కృషి చేస్తుంది.



కామిడి సతీష్ రెడ్డి
జయశంకర్ భూపాలపల్లి జిల్లా...
9848445134..

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
24.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఆరోగ్యకరమైన అలవాట్లు**

నిత్య వ్యాయామం చేయడం రోజుకు కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేస్తే గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. ఒత్తిడి కూడా తగ్గుతుంది.



# ప్రజావాణిలో 19 ఫిర్యాదులు

**ముద్ర, శేరిలింగంపల్లి :**




శేరిలింగంపల్లి జోన్ వ్యాప్తంగా సోమవారం ప్రజావాణి కార్యక్రమం కొనసాగింది. జోనల్ కార్యాలయంతోపాటు నార్సింగ్, అమీన్పూర్, పటాన్చెరువు, మియాపూర్ శేరిలింగంపల్లి సర్కిల్లో అధికారులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. మొత్తం 19 వినతులు అధికారులకు అందాయి. ఇందులో జోనల్ కార్యాలయంలో 4,శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో 9, నార్సింగ్ సర్కిల్ కార్యాలయంలో 1, మియాపూర్ సర్కిల్ కార్యాలయంలో 3, అమీన్పూర్ సర్కిల్లో 2 చొప్పున వినతులు వచ్చాయి. ఇందులో పట్టణ ప్రణాళిక, పన్ను విభాగం, ఇంజనీరింగ్ కు సంబంధించి సమస్యలను ప్రజలు వినతిపత్రం రూపంలో అందించారు. జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే ఆయా విభాగాల అధికారులతో కలిసి ప్రజావాణిలో వినతులను స్వీకరించారు.

## బి ఫార్మసీ విద్యార్థులకు న్యాయం చేయాలని వినతి

**ముద్ర, కూకట్‌పల్లి :**



జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల్లో చదువుతున్న బి ఫార్మసీ నాలుగో సంవత్సరం విద్యార్థులను అన్యాయంగా డిటైన్ చేయడంపై స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోరం ఆగ్రహం వ్యక్తం చేసింది. సోమవారం యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వరరావును కలిసి ఫోరం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. 2023 డిసెంబర్‌లో విడుదల చేసిన రెగ్యులేషన్ల ప్రకారం క్రెడిట్ నిబంధనలు లేవని స్పష్టంగా ఉన్నప్పటికీ, ఇప్పుడు కొత్త సర్క్యులర్‌ను సాకుగా చూపి విద్యార్థులను ఆపడం సరికాదని నాయకులు అన్నారు. నాలుగో సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న సమయంలో, హాల్ టికెట్లు జారీ చేసిన తర్వాత.. అకస్మాత్తుగా వాట్సాప్ గ్రూపుల ద్వారా డిటైన్ చేసినట్లు ప్రకటించడం విద్యార్థులను తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రెండో ఏడాది నుంచి మూడో ఏడాదికి ఏ నిబంధనలతో ప్రమోట్ చేశారో, అవే నిబంధనలను నాలుగో ఏడాదికి కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వెంటనే జోక్యం చేసుకుని డిటైన్ అయిన విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని వారు రిజిస్ట్రార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు జయరాం, రాజ్‌కుమార్, వసంత్, రిషి వరుణ్, రాబిన్, భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

**ముద్ర, కూకట్‌పల్లి :**



కేపీహెచ్‌బీ కాలనీ వసంత నగర్ డివిజన్ పరిధిలోని బుద్ధాస్ వర్డెక్స్ క్లాసిక్ అపార్ట్‌మెంట్స్‌లో మందలపు రోజారాణి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు.బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సౌజన్యంతో జరిగిన ఈ శిబిరంలో సుమారు 250 మందికిపైగా మహిళలు, పురుషులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈసందర్భంగా బసవతారకం ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ప్రేరణ మాట్లాడుతూ.. క్యాన్సర్ పట్ల భయానికి బదులుగా అవగాహన అవసరమని తెలిపారు. క్రమం తప్పకుండా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించవచ్చన్నారు. సరైన చికిత్సతో వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మందలపు రోజారాణి ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి వైద్య బృందం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, బుద్ధ హోమ్స్ కాలనీవాసులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.




## స్పెషలాఫీసర్ పాలనలో పరిపాలన అస్తవ్యస్తం

**ముద్ర, మల్కాజిగిరి :**

స్పెషల్ ఆఫీసర్ పాలనలో పరిపాలన పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ శ్రవణ్ ఆరోపించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజా సమస్యలు కుప్పలుగా పేరుకుపోయాయని అన్నారు. తార్నాకలోని మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన శ్రవణ్, అనంతరం మల్కాజ్గిరి జోనల్ కార్యాలయంలో కూడా వినతిపత్రం సమర్పిస్తూ తన నిరసన వ్యక్తం చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేయడానికి వెళ్లిన శ్రవణ్‌కు కమిషనర్ ఖాళీ కుర్చీ మాత్రమే కనిపించడంతో, నిరసనగా ఆ ఖాళీ కుర్చీకే వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ ఘటన అక్కడ ఉన్నవారిలో చర్చనీయాంశమైంది. తరువాత శానిటేషన్ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, ఇతర అధికారులు వచ్చి ఆయనతో మాట్లాడి వినతిపత్రాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ.. మల్కాజ్గిరి పరిధిలో శానిటేషన్ వ్యవస్థ పూర్తిగా అటకెక్కిందని ఆరోపించారు. అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా ఫీల్డ్‌లోకి వచ్చి సమస్యలను స్వయంగా పరిశీలించాలని కోరారు. దోమల మందు పిచికారీ పూర్తిగా నిలిచిపోయిందన్నారు. స్ట్రీట్ లైట్ల నిర్వహణ పట్టించుకునే వారు లేరని, చెరువుల్లో గుర్రపుడెక్క విస్తరిస్తోందని, తొలగింపు చర్యలు లేవని, టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రజలను వేధిస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. సమస్యలపై అధికారులు వెంటనే స్పందించకపోతే త్వరలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని శ్రవణ్ హెచ్చరించారు.






# మక్తల్‌లో జాతీయ స్థాయి క్రీడలు నిర్వహిస్తాం

**మంత్రి వాకిటి శ్రీహరి**

**ముద్ర, నారాయణపేట :**

మక్తల్ మినీ స్టేడియాన్ని రూ. 25కోట్లతో నిర్మించి జాతీయస్థాయి క్రీడలను ప్రారంభిస్తామని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సీఎం కప్ రెండవ ఎడిషన్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు మక్తల్ పట్టణంలో ప్రశాంతంగా ముగిసాయి. గత శుక్రవారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో 33జిల్లాల నుంచి 66టీంలు సుమారు 1200 మంది క్రీడాకారులు, కోచ్ లు, వారి సహాయకులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో మంత్రి డా. వాకిటి శ్రీహరి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. సీఎం కప్ క్రీడలు జాతీయస్థాయిలో క్రీడాకారులు రాణించేందుకు ఎంతో దోహదపడతాయన్నారు. కాగా సోమవారం పురుషుల, మహిళల జట్ల ఫైనల్ మ్యాచ్ లు హోరాహోరీగా జరిగాయి. మహిళల విభాగంలో గద్వాల జట్టు వర్సెస్ రంగారెడ్డి జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ లో 3631 పాయింట్ల తేడాతో గద్వాల విజేతగా నిలిచింది. మూడవ స్థానం కోసం కరీంనగర్, హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో 3718 పాయింట్ల తేడాతో కరీంనగర్ మూడవ స్థానం కైవసం చేసుకుంది. పురుషుల విభాగంలో వనపర్తి జట్టు రంగారెడ్డి జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ లో 3916 పాయింట్ల తేడాతో వనపర్తి జట్టు విజయం సాధించి మొదటిస్థానంలో నిలిచింది. మూడవ స్థానం కోసం జరిగిన పోటీలో గద్వాల జట్టు వర్సెస్ మేడ్చల్ జట్ల మధ్య జరిగిన పోరులో 3932 పోయింట్ల తేడాతో గద్వాల జట్టు మూడవ స్థానం కైవసం చేసుకుంది. విజేతలకు బహుమతులతోపాటు నగదు పురస్కారం అందించి అభినందించారు. డివైఎస్ఓ శెట్టి వెంకటేష్, డీఈవో గోవింద రాజులు, మక్తల్ మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస, వైస్ చైర్మన్ శైవి రెడ్డి, జిల్లాలోని పిడి, పిఈటిలు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# గుండాగిరి చేస్తే సహించేది లేదు

- పేటలో బీజేపీ నిరసన

**ముద్ర, నారాయణపేట :**



కాంగ్రెస్ నాయకులు చట్టాన్ని ఉల్లంఘిస్తూ గుండాగిరి చేస్తే సహించేది లేదని బిజెపి జిల్లా అధ్యక్షులు కొండా సత్యా యాదవ్ అన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ నాయకుల దాడిని నిరసిస్తూ సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నోటికి అడ్డంగా నల్లగుడ్డలు ధరించి వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.. కామారెడ్డి ఎమ్మెల్యే తన సొంత నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేక ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు ఇలాంటి దాడులను ఆపకపోతే రాబోయే రోజుల్లో బిజెపి ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ఉద్యమాన్ని చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత, వైస్ చైర్ పర్సన్ మంజుల రాఘవేందర్ రెడ్డి, కౌన్సిలర్లు సౌజన్య, ప్రభాకర్, అప్పిరెడ్డిపల్లి రాము, ఎరుకలి రఘు, కమలాపూర్ శ్రీనివాస్, మిర్చి వెంకటయ్య, బిజెపి మండల నాయకులు సాయిబన్న, కృష్ణ, హనుమంతు, భరత్, పళ్ళ రఘు, చేతన్, మణిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్‌లో చేరిన ఎన్ఎస్‌యూఐ యువకులు

**ముద్ర, తాండూర్ :**

వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణానికి చెందిన ఎన్ఎస్‌యూఐ యువ నాయకుడు మజర్ ఆధ్వర్యంలో పలువురు యువకులు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా రోహిత్ రెడ్డి గులాబీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి యువత పాత్ర కీలకమని, వారి చేరికతో పార్టీలో మరింత ఉత్సాహం పెరిగిందన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేంతవరకు విద్యార్థుల పక్షాన పోరాడగల సామర్థ్యం ఉన్న ఎన్ఎస్‌యూఐ యువకులు పార్టీలో చేరడం శుభపరిణామమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నూతన కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు పట్లోళ్ల నర్సింలు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ హాలు నందు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 106 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తోపాటు ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ రాజేశ్వరి, అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డిఓ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు ఇచ్చారు. ఈ ఫిర్యాదులను సంబంధిత అధికారులు దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**

రంగారెడ్డి జిల్లాలో జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో ముద్రించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్‌ను సోమవారం ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, జిల్లా డీఆర్ఓ సంగీత ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లాలోని మహిళా ఉద్యోగుల కోసం మార్చి 4న ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయాలని జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె.రామారావు జిల్లా కలెక్టర్‌ను కోరారు. అదేరోజు మహిళా ఉద్యోగులకు ఆటలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక అనుమతి ఇవ్వాలని అభ్యర్థించారు. మార్చి 7వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అనుమతివ్వాలని కోరారు. ఈమేరకు జిల్లా కలెక్టర్‌కు డీఆర్ఓ ద్వారా వినతిపత్రం సమర్పించినట్లు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె. రామారావు తెలిపారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 25 నుంచి ఇంటర్ పబ్లిక్ థియరీ పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు 25 నుంచి, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు 26 నుంచి ఇంటర్ పబ్లిక్ థియరీ ఎగ్జామ్స్ తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 6708 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1686 మంది, ఇంటర్ ద్వితీయ జనరల్ విద్యార్థులు 6549, ఒకేషనల్ విద్యార్థులు 1457మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 28 థియరీ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని పరీక్ష కేంద్రాలలో తాగునీటి సౌకర్యంతోపాటు మౌలిక వసతులు కల్పించామన్నారు. విద్యార్థులు ఉదయం 8 గంటల వరకు పరీక్ష కేంద్రానికి చేరుకునేలా విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలన్నారు. పరీక్ష సమయంలో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తుందన్నారు. విద్యార్థులను ఉదయం 9.05 నిముషాల వరకు పరీక్ష కేంద్రం లోనికి అనుమతిస్తామని తెలిపారు.

# రైతులపై కాంగ్రెస్ కక్ష

- రైతులపై కాంగ్రెస్ కక్ష
- గద్వాల ఎమ్మెల్యే ఏ పార్టీ లో ఉన్నారో ప్రకటించాలి
- రైతు సంఘర్షణ సభలో జాగృతి అధ్యక్షురాలు కవిత

**ముద్ర, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి :**




పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రైతులు ఆగమాగం అయ్యారని.. రైతు వ్యతిరేక కార్యకలాపాలు అమలు చేసిన బీఆర్ఎస్ ను తెలంగాణ రైతాంగం ఇంట్లో కూర్చొబెట్టిందని... మూడేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీకి కూడా అదే గతి పడుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు.సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన రైతు సంఘర్షణ సభలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా కవిత ప్రసంగిస్తూ ఈ నడిగడ్డ ప్రాంతం కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య ఉన్నా సాగునీటికి నోచుకోలేదన్నారు. ఈ ప్రాంతం వెనుకబాటుకు ఇక్కడి నేతలే ముఖ్య కారణమని ఆమె ఆరోపించారు. ఈ గద్వాల ప్రాంతంలో సీడ్ పత్తి అధికంగా సాగుచేస్తారని, పండించిన పంటను రైతులు ప్రభుత్వానికి విక్రయించినా ఇప్పటివరకు రైతుల బకాయిలు ఇవ్వలేదన్నారు. వారంలో బకాయిలు చెల్లించకుంటే గద్వాల కలెక్టర్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తామని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారో ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. బీఆర్ఎస్లో ఉన్నానంటూ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఉన్నారని, ఆయన అసమర్థత వల్లే నడిగడ్డ ప్రాంతం వెనుకబడిందన్నారు. ఏ పార్టీలో ఉన్నావో చెప్పడం చేతకాకుంటే ఎమ్మెల్యే పదవికీ రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో నడిగడ్డకు సాగునీరు అందివ్వడంలో విఫలం చెందాయన్నారు. ఎన్నికల అప్పుడు మాత్రం అత్త(డీకే అరుణ ), అల్లుడు(ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ) మూటలు పట్టుకుని ప్రజల వద్దకు వస్తారని, వచ్చే ఎన్నికల్లో వారిద్దరికీ బుద్ధి చెప్పాలన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మేము కూడా పోటీ చేస్తామని, వారి దగ్గర మూటలు తీసుకుని మాకు ఓటు వెయ్యాలని కవిత కోరారు. అనంతరం రైతు సమస్య లపై కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చేందుకు పాదయాత్రగా ఆమె వెళ్లారు. ఈ కార్యక్రమం లో జాగృతి నేతలు, రైతు సంఘర్షణ సమితి సభ్యులు, రైతులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 24-02-2026
www.mudranews.in | @mudranews



ఆరోగ్యకరమైన అలవాట్లు
సరిపడ నిద్రపోవడం



రోజుకు 7–8 గంటలు నిద్రపోవడం శరీరానికి అవసరం. మంచి నిద్ర మనసును, శరీరాన్ని తాజాగా ఉంచుతుంది.




## విద్యార్థులు మంచి, చెడు విచక్షణ ఏర్పరచుకోవాలి

- షీ టీం ఎస్సై ఫజల్ ఖాన్

ముద్ర: మహాదేవపూర్:

విద్యార్థులు తమకు సంబంధించిన విషయంలో మంచి ఏది చెడు ఏది అనే విచక్షణను ఏర్పరచుకోవాలని షీ టీం ఎస్సై ఫజల్ ఖాన్ సూచించారు. షీ టీం, భరోసా సంయుక్తంగా భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఎస్సై ఫజల్ ఖాన్ గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించి, అపరిచితుల ఫోన్, వీడియో కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. ముఖ్యంగా విద్యార్థినులు సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలిపారు. మహిళలు, విద్యార్థినుల భద్రతకు షీ టీం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఎవరికైనా అసభ్య ప్రవర్తన ఎదురైతే ధైర్యంగా 8712658162 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఫిర్యాదుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, అవసరమైతే కౌన్సిలింగ్‌తో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాఠశాల, వసతి గృహాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలుపాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 సేవలను వినియోగించుకోవాలని అన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండి, ఘటనలు జరిగితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీం, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లు వేగవంతం చేయండి

- కలెక్టర్ అభిలాష అభినవ్


ముద్ర ప్రతినిధి, నిర్మల్:




రానున్న గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులకు సూచించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌తో జరిగిన గోదావరి నది పుష్కరాల వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. ఇదివరకే సంబంధిత అధికారులు అందరితో, పుష్కరాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించినట్లు వివరించారు. బాసర జ్ఞాన సరస్వతి దేవాలయం, పుష్కర ఘాట్ వద్దకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున, దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి పుష్కర ఘాట్ వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ఘాట్ ల నిర్మాణం, నీటి వసతి, మరుగుదొడ్లు, పార్కింగ్ తదితర వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఓ శ్రీనివాస్, నీటిపారుదల ఈఈ అనిల్, జెడ్పీ సీఈవో గోవింద్, ఈఈ ఆర్ డబ్ల్యుఎస్ సందీప్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించటంలో జాప్యం చేయవద్దని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆమె స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. వేసవి కాలం సమీపిస్తున్నందున విద్యార్థులకు నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, జడ్పీ సీఈవో శంకర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో నిర్మల్ క్రీడాకారుల ప్రతిభ

ముద్ర ప్రతినిధి, నిర్మల్:

రాష్ట్ర స్థాయి సీఎం కప్ బాక్సింగ్ పోటీల్లో నిర్మల్ జిల్లా క్రీడాకారులు ప్రతిభను కనబరిచారు. 44 నుంచి 46 కిలో గ్రాముల విభాగంలో అనన్య, 48 నుంచి 50 కిలోగ్రాముల విభాగంలో కీర్తన ప్రతిభ చూపి కాంస్య పతకాలు సాధించారు. జిల్లా నుంచి ఏడుగురు క్రీడాకారులు పాల్గొనగా వీరిలో ఇద్దరు పతకాలు సాధించడం పట్ల డివై ఎస్‌ఓ శ్రీకాంత్ రెడ్డి వారిని అభినందించారు.




## విజ్ఞాన శాస్త్రంతో భవిష్యత్తు

- డీఈఓ దర్శనం భోజన్న

ముద్ర ప్రతినిధి, నిర్మల్:

విజ్ఞాన శాస్త్రంతో మెరుగైన జీవితానికి బాటలు వేసుకోవచ్చని డీఈఓ దర్శనం భోజన్న అన్నారు. జిల్లా విద్యాశాఖ, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం 8, 9 తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ స్థానిక జెవిఎన్ఆర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ టాలెంట్ టెస్ట్ ద్వారా విద్యార్థుల్లో సైన్స్ పట్ల మక్కువ పెరుగుతుందని, కఠినతరమైన అంశాల పైన నైపుణ్యత వస్తుందన్నారు. చిన్నతనం నుంచే జీవితంలో సైన్స్ పట్ల అభిరుచి పెంపొందించుకోవాలని అన్నారు. జిల్లాలోని 19 మండలాల నుంచి 57 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉర్దూ మీడియం విభాగంలో10 పాఠశాలల నుంచి 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

జడ్పీ సెకండరీ పాఠశాల, తానూర్ కు చెందిన షేక్ అద్నాన్, ఖానాపూర్ బాలికల జడ్పీ పాఠశాలకు చెందిన ఆర్ నందిని, జడ్పీ సెకండరీ స్కూల్ నర్సాపూర్ కు చెందిన మహావీర్ లు రాష్ట్రస్థాయి టెస్ట్ కు ఎన్నికయ్యారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి వినోద్ కుమార్, ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నారాయణ వర్మ, బచ్చు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు కూన రమేష్, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రఫీక్, సంఘ బాధ్యులు వందన, దేవేందర్, నబీ, ఫయాజుద్దీన్, సుధాకర్ పాల్గొన్నారు.

## 'పది' పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

ముద్ర, మహాదేవపూర్:



మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు జరుగనున్న 10 తరగతి పరీక్షలలో ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. సోమవారం ఐడిఓసి కార్యా లయంలో 10 వ తరగతి పరీక్షలు నిర్వహణపై విద్యాశాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, వైద్య, సమాచార, పంచాయతి రాజ్, రవాణా, విద్యుత్తు, ఆర్టీసీ, ట్రెజరి, పోస్టల్, మున్సిపల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన భద్రతా చర్యలు, రవాణా సౌకర్యాలు, వైద్య సదుపాయాలు, విద్యుత్ సరఫరా, ప్రశ్నాపత్రాల రవాణా, భద్రత తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ బందోబస్తు మధ్య ప్రశ్న, జవాబు పత్రాలు తరలించాలని సూచించారు. జిల్లాలో 21 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పర్యవేక్షణకు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసి వేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అత్యవసర సేవలకు వైద్య కేంద్రాలు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని, అలాగే 108 వాహనాలు, ప్రధాన ఆసుపత్రిలో అత్యవసర వార్డులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి అనువుగా అదనపు బస్సులు నడపాలని తెలిపారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో పారిశుద్య కార్యక్రమాలు నిర్వహించాలని పంచాయతి, మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఏఎస్పి నరేష్ కుమార్, డీఈఓ రాజేందర్, వైద్యాధికారి మధుసూదన్, ఆర్టీఓ సంధాని, ఆర్టీసీ డిఎం ఇందు, డిపిఓ శ్రీలత, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పూర్తికాని ఇందిరమ్మ ఇళ్లను తక్షణమే ప్రారంభించాలి

ప్రారంభించని ఇందిరమ్మ ఇళ్ళకు తక్షణమే మార్కౌట్ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సోమవారం ఐడిఓసి కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ, పీఆర్, మున్సిపల్, ఎంపిడివోలతో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, గ్రౌండింగ్ మరియు 2బీహెచ్‌కే గృహాల సముదాయాల పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొత్తం 4165 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, అందులో 58 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన 4107 ఇళ్లలో 898 ఇళ్లు ప్రారంభ దశలో, 582 బేస్ లెవెల్ దశలో, 1092 రూఫ్ లెవెల్ దశలో, 481 రూఫ్ కాంక్రీట్ దశలో ఉండగా, 1054 ఇళ్లకు మార్క్ అవుట్ చేయాల్సి ఉందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమని, అర్హులైన ప్రతి నిరుపేదకు గృహం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని ఆయన స్పష్టం చేశారు. యంత్రాంగం సమన్వయంతో పనిచేసి, మంజూరైన ఇళ్లన్నింటినీ త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. .

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, అన్ని మండలాల ఎంపిడివోలు, గృహ నిర్మాణ శాఖ డీఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



## గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహిస్తాం..

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

ముద్ర, మహదేవపూర్:

రాబోయే గోదావరి పుష్కరాల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన సమగ్ర ఏర్పాట్లపై దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ హైదరాబాద్ నుండి సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. ఐడిఓసి కార్యాలయం నుండి ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లాలో చేపట్టనున్న ఏర్పాట్ల వివరాలను వివరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ప్రణాళికలు తయారు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఇరిగేషన్, వైద్య, సమాచార, మిషన్ భగీరథ, దేవాదాయ, పంచాయతి రాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అరైవ్ అలైవ్ లో భాగంగా లేన్ డిసిప్లిన్ డ్రైవ్ డే




ముద్ర ప్రతినిధి, నిర్మల్:

ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణ రక్షణ లక్ష్యంగా ప్రారంభమైన అరైవ్ అలైవ్ కార్యక్రమం రెండో రోజు జిల్లా వ్యాప్తంగా కొనసాగింది. అందులో భాగంగా జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో లేన్ డిసిప్లిన్ డ్రైవ్ డే నిర్వహించారు.

ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ప్రధాన రహదారులు, జాతీయ రహదారులు పట్టణ ప్రాంతాలలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. తప్పుడు ఓవర్ టేకింగ్ చేస్తున్న వాహనదారులను గుర్తించి అవగాహన కల్పించారు. ఎడమ లేన్‌లోనే వాహనం నడపాల్సిన ట్రాఫిక్ నియమాలను వివరించారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాలపై వాహనదారులకు వివరించారు. రహదారి భద్రత అందరి బాధ్యత అనే సందేశాన్ని ప్రజలకు చేరవేశారు.

## పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి

- పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ముద్ర, పెద్దపల్లి:

పెద్దపల్లి జిల్లాలో ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఇంటర్ పరీక్షల నిర్వహణపై అదనపు కలెక్టర్లు జెల్ల అరుణశ్రీ, దాసరి వేణుతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. 25 నుంచి మార్చి 18 వరకు జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో జనరల్, వోకేషనల్ కలిపి మొత్తం 10,367 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, వీరి కోసం 22 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రానికి 100 మీటర్ల వరకు ఎటువంటి పార్కింగ్ ఉండోద్దని స్పష్టం చేశారు. విద్యార్థులు పరీక్షకు సకాలంలో హాజరయ్యేందుకు ఆర్టీసీ బస్సులు పరీక్షా కేంద్రాల రూట్‌లలో స్పెషల్ బస్సులు నడపాలని సూచించారు. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి కల్పన, పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు గంగయ్య, సురేష్, ఏసీపీ జి. కృష్ణ, కలెక్టరేట్ ఏవో బండి ప్రకాష్, మున్సిపల్ కమిషనర్లు ఆకుల వెంకటేష్, రమేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## హత్య కేసులో నిందితుడి అరెస్ట్

ముద్ర, పెద్దపల్లి:

ఈ నెల 21న పెద్దపల్లి జిల్లా సెంటినరీ కాలనీలో సంచలనం సృష్టించిన హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ తెలిపారు. సోమవారం ఆయన రామగిరి పోలిస్ స్టేషన్ లో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. బేగంపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి బుర్ర రాజకొమురయ్య (65) సెంటినరీకాలనీ సింగరేణి ఫంక్షన్ హాల్ వద్ద పాత కక్షలతో అదే గ్రామానికి చెందిన మొలుగూరి కొమురయ్య(58)ను శనివారం దారుణంగా హత్య చేశాడు. 2011లో నిందితుడి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మరణించగా.. తన కుమారుడి చావుకి మొలుగూరి కొమురయ్య, మొలుగూరి సత్తయ్య కారణమని పగ పెంచుకున్నట్లు తెలిపారు. శనివారం బంధువుల పెళ్లికి వచ్చిన తమ్ముడిపై నిందితుడు కత్తితో దాడి చేస్తుండగా అడ్డుకోబోయిన అన్నపై కూడా కత్తితో దాడికి దిగడంతో కొమురయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రామగిరి ఎస్సై తాడవేన శ్రీనివాస్ దర్యాప్తు ప్రారంభించి నిందితుడిని కల్వచర్ల పంచాయతీ పరిధి మారుతి నగర వద్ద అదుపు లోకి తీసుకున్నట్లు వెల్లడించారు. పోలీసులు నిందితుడి వద్ద నుంచి ద్విచక్ర వాహనం, దాడికి ఉపయోగించిన కత్తి, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావు, పోలిస్ సిబ్బంది పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
24.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews

7 తూర్పు తెలంగాణ
వరంగల్, ఖమ్మం, నల్గొండ
Warangal,Khammam,Nalgonda

**ఆరోగ్యకరమైన అలవాట్లు**

మానసిక ప్రశాంతతను కాపాడుకోవడం
ధ్యానం, యోగా వంటి పద్ధతులు ఒత్తిడిని తగ్గిస్తాయి. ప్రశాంతమైన మనసు ఆరోగ్యానికి ముఖ్యమైనది.






## సమన్వయంతో పనిచేయాలి

- టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్

**ముద్ర, కొత్తగూడెం:**

మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో పబ్లిక్ పరీక్షల నిర్వహణకు నియమించిన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లు, సిసెంటర్ కస్టోడియన్లు, మండల విద్యాశాఖాధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 73 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ పరీక్షలకు 12,731 మంది రెగ్యులర్ విద్యార్థులు, 404 మంది ప్రైవేట్ అభ్యర్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించబడతాయని వెల్లడించారు. గతంలో చోటుచేసుకున్న సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశ్నపత్రాల భద్రత, రవాణా, భద్రపరిచే విధానం, సమయపాలన వంటి అంశాల్లో ఎటువంటి లోపం ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, అసిస్టెంట్ డైరెక్టర్ శంభ ప్రసాద్, పరీక్షల సహాయ కమిషనర్ మాధవ రావు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## కలిసి కట్టుగా పని చేయాలి

- ఎమ్మెల్యే మందుల శామ్యూల్

**ముద్ర, మోత్కూర్:**

మున్సిపాలిటీ అభివృద్ధికి కౌన్సిల్ సభ్యులు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్ అన్నారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో చైర్ పర్సన్ గడ్డం స్వప్న అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ మొదటి సమావేశం నిర్వహించారు. ఇట్టి సమావేశానికి ఎమ్మెల్యే మందుల శామ్యూల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కౌన్సిల్ లో ప్రవేశపెట్టిన ఎజెండా అంశాలను చర్చించి, ఆమోదించారు. ప్రతి వార్డులో సీసీ రోడ్లు మురుగు నీటి కాల్వల నిర్మాణం, వీధి దీపాలు, వివిధ అభివృద్ధి పనుల కోసం కౌన్సిల్ సభ్యులు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని తెలిపారు. పెద్ద చెరువులో కలుస్తున్న మురుగు నీటిని శుద్ధి చేయడానికి సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. బునాదిగాని కాలువ పనులను అతి త్వరగా పూర్తి చేసి సాగు నీటిని పరిసర ప్రాంత రైతులకి పంటల సాగు కోసం అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. నూతన చైర్మన్ వైస్ చైర్మన్ వార్డు సభ్యుల పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ కమిషనర్ కె సతీష్ కుమార్, వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, వార్డు కౌన్సిలర్లు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.




## కారకులను కఠినంగా శిక్షించాలి

- రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వడ్డెబోయిన వెంకటేష్

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

రెండు నెలల రజక పసిపాపను హత్య చేసిన అగ్రకులాల పెత్తందారులను కఠినంగా శిక్షించాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వడ్డెబోయిన వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో రైతుబజార్ ఎదురుగా నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో రజకులపై దాడి చేసి, పసిపాపను హత్య చేసిన అగ్రకుల పెత్తందారుల దిష్టి బొమ్మను దహనం వెంకటేష్ మాట్లాడుతూ, నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామంలో గత బుధవారం మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రజక దంపతులు స్వామివారి దర్శనం కోసం గుడిలోకి ప్రవేశించగా టికెట్టు లేకుండా గుడిలోపలకి రావద్దు అని రజకులపై దాడి చేసి పెత్తందారు శ్రీనివాసరెడ్డి కీర్తి రెండు నెలల బిడ్డను కాళ్లతో తన్ని చంపేశారని ఆరోపించారు. పోలీసు యంత్రాంగం బాధితుల పక్షాన కేసు నమోదు చేయకుండా బాధితులపైనే తిరిగి కేసు నమోదు చేశారని అగ్రకులాల పెత్తందారులకు పోలీసులు వత్తాసు పలకడం సరైనది కాదని అన్నారు. దోషులను కఠినంగా శిక్షించకుండా పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం సరైనది కాదని, పసిపాప హత్యకు కారణమైన దోషులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించే వరకు మా పోరాటం కొనసాగుతుందని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు నెమలి కరుణాకర్, ఐతరాజ కిష్టయ్య, సంఘం మండల నాయకులు ముదిగొండ నరేష్, మరిపెల్లి కిష్టయ్య, వడ్డెబోయిన స్వప్న,ఎల్లంల అనుష, కంబాలపల్లి యాదయ్య, మరిపెల్లి రాములు పాల్గొన్నారు.

## అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ జహంగీర్

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



ఈ వార్షిక బడ్జెట్లో యాదాద్రి భువనగిరి జిల్లా అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ.జహంగీర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. జిల్లాలో అత్యంత కీలకమైన బస్వాపురం ప్రాజెక్టు పూర్తి నిర్మాణానికి ఈ బడ్జెట్ లో రూ.500 కోట్ల నిధులు కేటాయించాలని అన్నారు. ఇప్పటికే ప్రాజెక్టు 90 శాతం పూర్తయిందని మిగతా పని పూర్తి కావాలన్నా, నిర్వాసితులకు పూర్తిస్థాయి నష్టపరిహారం అందాలన్నా వెంటనే నిధులు కేటాయించాలని కోరారు. జిల్లాలోని తాగు, సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నిధుల సాధనకు జిల్లాలో ఉన్న ఐదుగురు కాంగ్రెస్ శాసనసభ్యులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా , బట్టుపల్లి అనురాధ పాల్గొని మాట్లాడగా, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, బొలగాని జయరాములు, మాయ కృష్ణ, గంగాదేవి సైదులు, ఎంఏ. ఇక్బాల్, మధ్యపురం రాజు, ఆలేరు మండలం కార్యదర్శి ధూపాటి వెంకటేష్, బొమ్మలరామారం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, తుర్కపల్లి మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్, యాదగిరిగుట్ట పట్టణ కార్యదర్శి నూకల భాస్కర్ రెడ్డి తోపాటు ఈర్లపల్లి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా వాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలిసి జిల్లా కలెక్టర్ వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 54 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 26, పంచాయతీ శాఖ 7,ఇరిగేషన్ 5, ఎలక్ట్రిసిటీ 3, ఎంప్లాయిమెంట్ టీమ్ 3, వ్యవసాయ 2, ఈ ఈ డివిజన్ 2,మున్సిపాలిటీ 2, గ్రామీణాభివృద్ధి శాఖ 2, ఎస్సీ కార్పొరేషన్, సంక్షేమ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలిపారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ జయమ్మ, జెడ్పీ సిఈఓ శోభ రాణి గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధికి కృషి

**ముద్ర, మోత్కూర్:**

మహిళల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్ అన్నారు. సోమవారం మండలంలోని దాచారం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించే మహిళా సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ దాచారం గ్రామంలో రూ.3.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. మొదటి విడుత 21 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని రెండో విడతలో మరో 15 ఇళ్లు దాచారం గ్రామానికి ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలోని ప్రధాని సమస్య అయినటువంటి 273 సర్వేనెంబర్ భూములకు సంబంధించి రైతులకు పట్టాదారు పాసు బుక్కులు రాలేదని ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లగా తాహసిల్దార్ జ్యోతిని ఇట్టి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. పొడిచేడు నుండి దాచారం వరకు త్వరలో బీటీ రోడ్డు ఏర్పాటు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్నే జ్యోతి వీరేశం, ఉప సర్పంచ్ భీమనబోయిన ఆయిలయ్య ఎపిడి జంగా రెడ్డి, తాహసిల్దార్ జ్యోతి, పంచాయితీ కార్యదర్శి యాదగిరి, వార్డు సభ్యులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు .

## కార్మికుల పేర్లు ఆన్‌లైన్ చేయాలి

- జిపి ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పైళ్ల గణపతి రెడ్డి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్ కార్మికుల పేర్లు వెంటనే ఆన్‌లైన్ చేయాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పైళ్ల గణపతి రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల కై పరిష్కారానికి కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బంది అందరిని రెండవ పిఆర్సి పరిధిలోకి తీసుకోవాలని గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని ఆన్లైన్లో లేని కార్మికుల పేర్లు వెంటనే ఆన్లైన్లో నమోదు చేయాలని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా జీవో నెంబర్ 51 సవరణ మల్టీపర్పస్ విధానం రద్దు కొరకు తీర్మానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేష్, గ్రామ పంచాయతీ గౌరవ అధ్యక్షులు దాసరి పాండు, సిఐటియు ఉపాధ్యక్షులు మాయ కృష్ణ, గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పొట్ట యాదమ్మ, గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకరికంటి రాము తదితరులు పాల్గొన్నారు.



## పాడైన వాహనాల తొలగింపు

**ముద్ర ప్రతినిధి, బోడుప్పల్:**

మల్కాజ్గిరి నగర పాలకసంస్థ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ లో రోడ్డు పక్కన పాడై వదిలేసిన వాహనాలను తొలగించే కార్యక్రమం అధికారులు మొదలుపెట్టారు. మల్కాజ్గిరి నగర పాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు బోడుప్పల్ సర్కిల్ వంద రోజుల ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా సోమవారం రోడ్డు పక్కన పడివున్న పాడైన వాహనాలను ట్రాఫిక్ పోలీస్ వారి సహాయముతో గుర్తించారు. వాటిని డిప్యూటీ కమిషనర్ ఎ.శైలజ ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తో కలిసి మేడిపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమం లో శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జీలతో బిజెపి నిరసన

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

బీజేపీ రాష్ట్ర నాయకుల అక్రమ అరెస్టులకు నిరసనగా ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరామ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో శాంతియుత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష నాయకుల స్వరాన్ని అణచివేయడానికి అక్రమ అరెస్టులు చేయడం దురదృష్టకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, రాష్ట్ర నాయకులు పడమటి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శ్యామ్ సుందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, మేడి కోటేష్, జనగాం నర్సింహ చారి, ఊదరి సతీష్, కొల్లోజు శ్రవణ్ కుమార్, కోళ్ల భిక్షపతి, కొలిచెలిమ మల్లిఖార్జున్, కారుపాటు రాజు తదితరులు పాల్గొన్నారు.



## కర్ల రాజేష్ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

**ముద్ర ప్రతినిధి, కోదాడ :**



ఇటీవల మరణించిన కర్ల రాజేష్ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వుల కాపీని జిల్లా కలెక్టర్ కోదాడలోని రాజేష్ తల్లి లలితకు అందించారు. ఈ సందర్భంగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటిని రెండు, మూడు నెలల్లో పూర్తి చేసి అందించాలని సంబంధిత హౌసింగ్ ఏఇని ఆదేశించారు. పనుల్లో జాప్యం చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, హౌసింగ్ ఏఈ జెఎస్ఎన్ మూర్తి, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద రాణి, తహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.



## ఆక్రమణకు పాల్పడితే చర్యలు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మునిసిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ హెచ్చరించారు. సోమవారం భువనగిరి పట్టణంలోని హుస్సేనాబాద్ శివారులో సర్వే నెంబర్ 157లో ప్రభుత్వ భూమి ఇండోర్ స్టేడియంకు కేటాయించిన స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణంను నిలిపివేశారు. ఇండోర్ స్టేడియం స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం గురించి జిల్లా స్పోర్ట్స్ అండ్ యూత్ అధికారితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భువనగిరి తాసిల్దార్ అంజిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్ కరుణాకర్, నాయకులు హిరేకార్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 24.02.2026
www.mudranews.in | @mudranews



**ఆరోగ్యకరమైన అలవాట్లు**

సమయానికి భోజనం చేయడం. సరైన సమయాల్లో భోజనం చేస్తే జీర్ణక్రియ సరిగా ఉంటుంది. అలా చేయకపోతే గ్యాస్, ఆమ్లత్వం సమస్యలు వస్తాయి.



# పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య**



**సంగారెడ్డి, ముద్ర:** జిల్లాలో జరుగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలను ఎలాంటి లోటు పాట్లు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 14 నుంచి ఏప్రిల్ 15 వరకు పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 24,657 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. వీరి కోసం 123 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందుగానే చేరుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేసి, తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని స్పష్టం చేశారు. ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీటి వసతి, పరిశుభ్రమైన వాతావరణం, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రథమ చికిత్స సదుపాయం తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు ప్రతి కేంద్రంలో ఫుల్ టైమ్ స్కావెంజర్‌ను నియమించి మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు రవాణా పరంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్ష సమయాలకు అనుగుణంగా బస్సులు నడిపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు.

ఎంఈఓలు పరీక్షా కేంద్రాలను ముందస్తుగా తనిఖీ చేసి అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. ప్రశ్నాపత్రాలు, ఆన్సర్ షీట్లను కట్టుదిట్టమైన భద్రత మధ్య తరలించాలన్నారు. ఈ సమావేశంలో డిఈవో వెంకటేశ్వర్లు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవిందు రామ్, డీఎంహెచ్ఓ డా.వసంత్ రావు, పోలీస్, ఆర్టీసీ, పోస్టల్, విద్యుత్, ట్రాన్స్‌పోర్ట్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి..**

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ మాధురి, డిప్యూటీ కలెక్టర్ ఉమా హారతి, జెడ్పీ సీఈవో జానకి రెడ్డి, ఆర్డీఓలు రాజేందర్, దేవుజ తదితరులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణిలో మొత్తం 38 వినతులు వచ్చినట్లు చెప్పారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి చర్యలు తీసు కోవాలన్నారు. ఫిర్యాదుల పరి ష్కా రంలో జాప్యం చేయవద్దన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## డైరీ ఆవిష్కరణ

**ముద్ర ప్రతినిధి, మెదక్:** పబ్లిక్ హెల్త్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ -3194 యూనియన్ రూపొందించిన డైరీని సోమవారం డిఎంహెచ్ ఓ డా. శ్రీరామ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు డా. నవ్య, డా.హరి ప్రసాద్, ఐఎఫ్టీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయేందర్, చేగూరి రాజి రెడ్డి, గౌరవ అధ్యక్షుడు కె.చందర్, బాల నర్సయ్య, నాయకులు మద న్మోహన్, షఫీ, మొయిజ్, నరేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, కిష్టయ్య, వంశీ, అలీ, శ్రీనివాస్, రమేష్, మల్లిఖార్జున్, మోహన్ గౌడ్, పాల్గొన్నారు.

## పాఠశాల ప్రహరీకి భూమిపూజ

**జోగిపేట, ముద్ర:** బర్దిపూర్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ పనులకు సోమవారం భూమిపూజ చేశారు. టేక్మాల్ మండల మాజీ వైస్ ఎంపీపీ విష్ణువర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సంగమేశ్వర్, సర్పంచ్ సాయిబాబా, ఉప సర్పంచ్ శంకరయ్య, వార్డు మెంబర్లు అంజ య్య, రాధా, రవి, గోపాల్ పాల్గొన్నారు.

# ప్రజావాణిని మరింత బలోపేతం చేస్తాం

**మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మండల కేంద్రాల్లో ప్రజావాణిని మరింత బలోపేతం చేస్తామని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం నిజాంపేట్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల దూర భారం, విలువైన సమయాన్ని తగ్గించడం కోసమే మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. .మండల కేంద్రాల్లో ప్రజావాణిని మరింత బలోపేతం చేసేందుకు నోడల్ అధికారులను నియమిస్తామని చెప్పారు. నిజాంపేట ప్రజావాణిలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని సమస్యలు పరిష్కరించాలన్నారు. ఒకవేళ పరిష్కారం కాని వాటిని రాతపూర్వకంగా ఫిర్యాదుదారులకు అందించాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కోర్టు పరిధిలో, పోలీసు పరిధిలో ఉన్న వాటిని సంబంధిత శాఖలకు పంపించాలని సూచించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్ లైన్ చేసి, వారం రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలు జిల్లా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే వారి సమస్యలకు పరిష్కారం దొరికేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్య అధికంగా ఉన్నందు వల్ల వాటిని పరిష్కరిస్తామన్నారు. పరిష్కరించని వాటిని రాతపూర్వక సమా ధానం అందిస్తారని పేర్కొన్నారు. అనం తరం తహసీల్దార్ కార్యాల యానికి స్థల పరిశీలన చేశారు. స్థలంలో తహసీ ల్దార్ కార్యాలయం అని బోర్డు ఏర్పాటు చేయా లన్నారు. తహసీల్దార్ శ్రీనీవాస్, ఎంపీ డీ వో రాజారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో మహిళలకు భద్రత లేదు




**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** ప్రజా ప్రభుత్వంలో మహిళలకు భద్రత లేదని సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల ఆరోపించారు. పట్టణంలోని కాళ్లకుంట కాలనీకి చెందిన మహిళపై ఇటీవల సాదుల సాయి ప్రతాప్ గంజాయి మత్తులో బలాత్కారం చేయడంతో తీవ్రంగా గాయపడి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొండం సంపత్ రెడ్డి, పాల సాయిరాం, పట్టణ కౌన్సిలర్లతో కలిసి సోమవారం మహిళను పరామర్శించారు. ఎమ్మెల్యే హరీష్ రావు ఆదేశాల మేరకు తక్షణ సాయంగా పదివేల రూపాయల నగదు అందజేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరు మంజుల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడినప్పటి నుంచి మహిళలకు రక్షణ కరు వైందని విమర్శించారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ సక్రమంగా విధులు నిర్వహించడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు లోతైన సమాచారాన్ని సేకరించి, బాధితురాలకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ లో అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. నిందితున్ని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వడ్లకొండ సాయికుమార్, కొండం కవిత, గోపాలపురం దీప్తి, బంధారం శ్రీలత, దాసరి భాగ్యలక్ష్మి , కాటం , బీఆర్ఎస్ నాయకురాలు నందాదేవి, బూర విజయ, గాడిపల్లి అరుణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కంపెనీ నిర్మాణం వద్దు

**అదనపు కలెక్టర్ కు కామారం సర్పంచ్, గ్రామస్థుల విజ్ఞప్తి**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** టైర్లు కరిగించి వాటి నుంచి ఆయిల్, పౌడర్ తయారీ చేసే కంపెనీని తమ గ్రామంలో నిర్మించవద్దని చిన్న శంకరంపేట మండలం కామారం సర్పంచ్ సుజాత సుధాకర్ ఆధ్వర్యంలో గ్రామస్థులు కలెక్టర్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ నగేష్ కు వినతిపత్రం అందచేశారు. ఇప్పటికే గ్రామంలో ఉన్న రెండు కంపెనీల వల్ల ఊరు పూర్తిగా కలుషితమైందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ సర్వే నంబర్ 103లో నూతనంగా నిర్మిం చతలపెట్టిన వాహనాల టైర్లను కరిగించి ఆయిల్, పౌడర్ తయారీ కంపెనీ పెట్టడం వలన కామారం గ్రామం పూర్తిగా కలుషితం అవుతుందన్నారు. తక్షణమే నూతనంగా నిర్మించ తలపెట్టిన కంపెనీని నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామంలో నూతన కంపెనీని నిర్మిస్తే రెండు చెరువులు పూర్తిగా కలుషితమవుతాయన్నారు. కలుషిత జలాల వల్ల చేపలు మృత్యువాత పడటంతో పాటు భూగర్భ జలాలు కూడా కలుషిత మవుతాయన్నారు. దీంతో రైతులు తీవ్ర నష్టం ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు.

## రజక సంఘం నాయకుల నిరసన



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** నాగర్ కర్నూల్ మండల పరిధిలో కుమ్మెర మల్లన్న జాతర దైవ దర్శనానికి వెళ్లిన తమ కులానికి చెందిన చంద్రకళ కుటుంబాన్ని అడ్డుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిద్దిపేటలో రజక సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని పాత బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి ఆందోళన చేశారు. రజక సంఘం నాయకులు దుర్గయ్య, భూంపల్లి కనకరాజు, భూంపల్లి లింగస్వామి, భూంపల్లి శ్రీనివాస్, వైకుంఠం, నారా యణరావుపేట శ్రీనివాస్, నరేష్, యాదగిరి, శ్యామ్ పాల్గొన్నారు.

## ముస్లిం సమాజాన్ని తప్పుదారి పట్టించొద్దు




**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** ముస్లిం సమాజాన్ని తప్పుదారి పట్టించొద్దని సిద్దిపేట తంజీమ్ సుప్రీం బాడీ ప్రధాని కార్యదర్శి అబ్దు ల్ ఖాదర్ కోరారు. సోమవారం సిద్ది పేట తంజీమ్ హజ్ హౌస్ లో విలేక రులతో మాట్లాడారు. తంజీమ్ 414/ 2010 రిజిస్ట్రేషన్ రద్దు అయిందని చెప్పారు. దానికి బదులు 284/2023 రిజిస్ట్రేషన్ అమలులో ఉందని పేర్కొన్నారు. సిద్దిపేట ప్రజలు కొంతమంది చేప్తున్నట్టుగా వారి మాటలను పరిగ ణలోకి తీసుకోవద్దని సూచించారు. తంజీమ్ షాపింగ్ కాంప్లెక్స్ లలో కిరాయికి ఉన్న వారు తమ కిరాయి ను సిద్దిపేట తంజీమ్ కమిటీ హజ్ హౌస్ లో చెల్లించాలన్నారు. ఫయాజ్, మహమూద్ అలాగే వారితో ఉన్నవారు ఎవరు కూడా కిరాయి వసూలు చేయడానికి వీల్లేదని సిద్దిపేట కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్న విషయాన్నీ కిరాయి దారులు గమనించాలని సూచించారు. సమావేశం లో సిద్దిపేట తంజీమ్ కమిటీ అధ్యక్షుడు జియావుద్దీన్ అసిఫ్, సుప్రీం బాడీ సభ్యులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లాను సందర్శించిన వన్ హెల్త్ పైలట్ ప్రాజెక్ట్ అధికారులు



**సంగారెడ్డి, ముద్ర:** భారత ప్రభుత్వ ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలోని (ఎన్ సీడీసీ), (యు ఎన్ డీపీ) సంయుక్తంగా నిర్వహిస్తున్న వన్ హెల్త్ పైలట్ ప్రాజెక్ట్ ఫీల్డ్ అసెస్ మెంట్ లో భాగంగా సోమవారం సంబంధిత అధికా రులు సంగారెడ్డి జిల్లాను సందర్శించారు. ఈ సందర్భంగా ఉదయం ఎన్ సీడీసీ బృందం, డీఎంహెచ్ ఓ డాక్టర్ ఎం. వసంత్ రావు, ఎపిడెమియాలజిస్ట్, యు ఎన్ డీపీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వన్ హెల్త్ పైలట్ ప్రాజెక్ట్ లక్ష్యాలు, అమలు విధానం, ఆయా శాఖల సమన్వయం పై చర్చించారు. అనంతరం బృందం జిల్లా ప్రయోగశాల T-Hub ను సందర్శించారు. . సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించారు. అనంతరం డీఎంహెచ్ ఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనతరం మంజీరా వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు.

ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ ఓ డా. ఎం. వసంతరావు, డా. అతుల్ ఆనంద్ (కన్సల్టెంట్, వన్ హెల్త్ – UNDP) పాల్గొన్నారు.

## క్యాలండర్ ను ఆవిష్కరించిన మంత్రి



**సంగారెడ్డి, ముద్ర:** ఇండియన్ సొసైటీ ఆఫ్ రేడియోగ్రాఫర్స్ అండ్ టెక్నాలజిస్ట్ తెలంగాణ స్టేట్ చాప్టర్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్లతో పాటునేషనల్ కాన్ఫరెన్స్ కోసం రూపొందించిన పోస్టర్ లను సోమ వారం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చాప్టర్ అధ్యక్షుడు ఎంఏ. హన్నారీ, జనరల్ సెక్రెటరీ జి. గంగాధర్, ఫైనాన్స్ సెక్రెటరీ బండి లింగరాజు, సొసైటీ కార్యవర్గ సభ్యులు టోనీ అంటోనీ, రహిమా, మానస, మొత్కూరు శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్ బి.సురేష్, విద్యాసాగర్, గణేష్, ప్రకాష్ సాయిచందు, నాగరాజు, అర్జున్, భావన, నాగార్జున, శ్రీనివాస్ నాయక్, ఎం. రాజేష్, కిరణ్ నాయక్, ప్రభాకర్ గౌడ్ తరితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలకు ఆటానమస్ హోదా

**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆటానమస్ (స్వయంప్రతిపత్తి) హోదా లభించింది. కళాశాల సమర్పించిన ప్రతిపాదనను పరిశీలించిన యూజీసీ స్టాండింగ్ కమిటీ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా.హుస్సేన్ తెలిపారు. 2026–27 విద్యా సంవత్సరం నుంచి 2030–31 వరకు ఐదు సంవత్సరాలపాటు స్వయంప్రతిపత్తి హోదా కల్పించినట్లు ప్రిన్సిపాల్ వివరించారు. ఈ విజయానికి సహకరించిన ఉన్నత విద్యాశాఖ అధికారులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం అధికారులు, అధ్యాపక బృందం, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ అందజేత

**జోగిపేట, ముద్ర:** వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జోగిపేట వాసికి ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్‌ను అందజేశారు. జోగిపేట 16వ వార్డుకు చెందిన గంజి మల్లేశం దీర్ఘకాలంగా తీవ్రమైన ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం మంత్రి దృష్టికి రావడంతో వెంటనే స్పందించారు. కౌన్సిలర్ శ్రీనివాస్, పట్లోళ్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## టాలెంట్ టెస్టులతో ప్రతిభ వెలికితీత

**ముద్ర ప్రతినిధి, మెదక్:** టాలెంట్ టెస్టులు విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి దోహద పడతాయని మెదక్ డిఈఓ విజయ అన్నారు. సోమవారం పట్టణంలోని ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సామాన్య శాస్త్రం పట్ల ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు అభిరుచిని పెంపొందించుకోవాలని సూచించారు. ఏఎంఓ సుదర్శన్ మూర్తి, శంకర్, మధుమోహన్, శ్రీనివాస్, సైన్స్ అధికారి రాజిరెడ్డి, సైన్స్ ఫోరం బాధ్యులు దయానంద రెడ్డి, ప్రభు, మల్లారెడ్డి, రజిని, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
24.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## ఆరోగ్యకరమైన అలవాట్లు

**హానికర అలవాట్లకు దూరంగా ఉండడం**
మద్యం, ధూమపానం వంటి అలవాట్లు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. వీటిని పూర్తిగా నివారించడం మంచిది.





## మహిళా సంక్షేమం, భద్రతకు కార్యాచరణ

- మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- అంశాల వారీగా సబ్ కమిటీలు ఏర్పాటు
- ఉద్యోగ రంగంలో మహిళలకు సమాన హక్కులు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

మహిళల సమగ్ర సంక్షేమం, భద్రత కోసం మహిళా, శిశు సంక్షేమ, పోలీస్ శాఖల సమన్వయంతో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. ముందుగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. మహిళల సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి పునాదన్న మంత్రి.. వారి భద్రత, సమాన అవకాశాలు, ఆరోగ్యం, గౌరవప్రద జీవనం కల్పించడం ప్రభుత్వ ధర్మం అన్నారు. లింగ వివక్షను నిర్మూలించి, మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. విద్యా వ్యవస్థలోనే లింగ సమానత్వ భావనను బలపరిచే విధంగా పాఠ్యాంశాలలో మార్పులు చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో మహిళల అభివృద్ధి, సాధికారత, సమాన అవకాశాలు, భద్రత అంశాలపై పలు కీలక శాఖలతో ఆమె ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఉద్యోగ రంగంలో మహిళలకు సమాన హక్కులు, ప్రైవేటు రంగంలోనూ మహిళలకు మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ అమలు వంటి అంశాలపై విధానపరమైన మార్పులు అవసరమని అభిప్రాయపడ్డారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు, డేటింగ్ యాప్స్, మ్యాట్రిమోనియల్ సైట్ల ద్వారా జరుగుతున్న మోసాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో వెలువడిన సూచనల అమలుకు అంశాల వారీగా సబ్ కమిటీలు ఏర్పాటు చేసి, తక్షణమే కార్యాచరణ బృందాలను నియమించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీజీ చారు సిన్హా, పీసీసీఎఫ్ డా. సి. సువర్ణ, మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ దివ్యా దేవరాజన్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టరేట్‌కు చెందిన సంగీతా సత్యనారాయణ, విద్యాశాఖ స్పెషల్ సెక్రటరీ వెంకటేశ్ దోత్రే, మున్సిపల్ శాఖ కమిషనర్లు పాల్గొన్నారు.



## ఎడ్ సెట్ నోటిఫికేషన్ రిలీజ్

- ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- మే 12న పరీక్ష

**ముద్ర, హైదరాబాద్ :**

రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రతిష్టాత్మక ఎడ్ సెట్ 2026 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఏడాది పరీక్ష నిర్వహణ బాధ్యతలను స్వీకరించిన కేయూ, దరఖాస్తుల ప్రక్రియ నుంచి ఫలితాల విడుదల వరకు పూర్తి షెడ్యూల్‌ను వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ అధికారులు ఖరారు చేశారు. మే 12న తెలంగాణ వ్యాప్తంగా టీజీ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థుల సంఖ్యను బట్టి ఉదయం , సాయంత్రం రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరుగుతాయి. పరీక్ష పూర్తయిన మూడు రోజుల్లోనే అంటే మే 15న అధికారులు ప్రాథమిక కీని విడుదల చేస్తారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే స్వీకరించిన అనంతరం, మే 30వ తేదీన తుది ఫలితాలను వెల్లడించనున్నారు. బీఈడీ కోర్సుల్లో చేరాలనుకునే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని యూనివర్సిటీ వర్గాలు వెల్లడించాయి. కాగా ఈ నెల 23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుండగా, అభ్యర్థులు ఏప్రిల్ 15 వరకు ఎలాంటి అపరాధ రుసుము చెల్లించకుండా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. గడువు ముగిసిన తర్వాత కూడా అభ్యర్థుల సౌకర్యార్థం అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకునే వెసులుబాటును అధికారులు కల్పించారు. రూ. 250 జరిమానాతో ఏప్రిల్ 23 వరకు, రూ. 500 ఫైన్‌తో ఏప్రిల్ 27 వరకు , రూ. వెయ్యి అపరాధ రుసుముతో ఏప్రిల్ 30 వరకు దరఖాస్తులు అనుమతించనున్నారు.

# ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 25 నుంచి వచ్చే నెల 18 వరకు పరీక్షలు
- హాజరుకానున్న 9,97,075 మంది విద్యార్థులు
- వివరాలు ప్రకటించిన ఇంటర్మీడియట్ బోర్డు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఫస్టియర్, సెకండియర్ విద్యార్థినీ విద్యార్థులకు ఈ నెల 25 నుంచి మార్చి 18 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు థియరీ పరీక్షలు జరగనున్నాయి. రాష్ట్రంలో మొత్తం 9,97,075 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారని తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ప్రకటించింది. అందులో ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 4,89,126 మంది, సెకండియర్ విద్యార్థులు 5,07,949 మంది ఉన్నట్లు తెలిపింది. ఇందుకోసం స్టేట్ వైడ్‌గా 1,495 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించింది, ఇందులో ప్రైవేటు కాలేజీలతో పాటు 404 ప్రభుత్వ జూనియర్ కళాశాలు కూడా ఉండగా పరీక్షల నిర్వహణ కోసం 28,500 మంది ఇన్విజిలేటర్లు, 75 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 200 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించినట్లు తెలిపింది. విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్న బోర్డు... విద్యార్థులు వెబ్‌సైట్ (tgbie.cgg.gov.in) నుంచి లేదా కళాశాలల నుండి హాల్ టికెట్లు పొందవచ్చని పేర్కొన్నది. ప్రిన్సిపల్ సంతకం లేకపోయినా డౌన్‌లోడ్ చేసిన హాల్ టికెట్లను అనుమతించాలని బోర్డు ఆదేశించింది. కాగా పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనకు గురైతే నిపుణులైన సైకాలజిస్టుల సలహాల కోసం 14416 అనే టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని బోర్డు సూచించింది. ఈ సేవలు 24 గంటలు అందుబాటులో ఉండనున్నాయి.

**7,500 సీసీ కెమెరాలతో నిఘా..**

ఇక సెల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్లు లేదా ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను పరీక్షా హాల్లోకి అనుమతించరు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నారు. విద్యార్థుల కోసం ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీరు, ఫర్నిచర్, గోడ గడియారాలు వైద్య సహాయం అందుబాటులో ఉంటాయి. పరీక్షా కేంద్రాల వద్ద నిఘా కోసం సుమారు 7,500 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని టీజీబీఐఈ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నేరుగా పర్యవేక్షిస్తారు. అలాగే, పరీక్షల సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని అధికారులు ఆదేశించారు.





# కుల వివక్ష.. పసికందు బలి

- బీసీ కమిషన్ సీరియస్
- కుమ్మెర మల్లన్న జాతర ఘటనపై సుమోటో చర్య
- నాగర్ కర్నూల్ కలెక్టర్, ఎండోమెంట్స్ కమిషనర్‌కు నోటీసులు జారీ

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో చోటుచేసుకున్న రెండు నెలల పసికందు మృతి, బీసీ వర్గాలకు ఆలయ ప్రవేశం నిరాకరించారన్న ఆరోపణల ఘటనపై రాష్ట్ర బీసీ కమిషన్ తీవ్రంగా స్పందించింది. పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సుమోటోగా స్పందించిన కమిషన్.. ఈ అమానవీయ ఘటనపై తక్షణమే పూర్తిస్థాయి విచారణ జరిపి, మూడు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్‌తో పాటు, దేవాదాయ శాఖ (ఎండోమెంట్) కమిషనర్ కు బీసీ కమిషన్ నోటీసులు జారీ చేసింది. కాగా ఈ నెల 19న నాగర్ కర్నూల్ మండలంలోని కుమ్మెర గ్రామంలో జరిగిన మల్లన్నజాతరకు వచ్చిన నిరుపేద రజక కుటుంబానికి చెందిన చిల్కేశ్వరం గణేశ్, మౌనిక దంపతులు వచ్చారు. అయితే కులం ఆధారంగా అగ్రకులాలకు చెందిన కొందరు జాతర నిర్వాహకులు ఆలయ ప్రవేశానికి నిరాకరించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో నిర్వాహకులకు, భక్తులకు మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో గణేష్ తన భార్యను పక్కకు తీసుకెళ్తుండగా, వారి చేతిలోని రెండు నెలల పసికందు కింద పడిపోయింది. కింద పడిన చిన్నారిని జాతర నిర్వాహకులు కాలితో తన్నారని, అందుకే తమ బిడ్డకు తీవ్ర గాయాలయ్యాయని బాధిత తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన ఆ చిన్నారి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనతో కుమ్మెర గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కుల వివక్ష చూపి, తమపై దాడి చేయడంతో పాటు, నిర్వాహకులు కాలితో తన్నడం వల్లే తమ బిడ్డ ప్రాణాలు కోల్పోయిందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దోషులను కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై బీసీ కమిషన్ రంగంలోకి దిగడంతో విచారణ వేగవంతం అయ్యే అవకాశం ఉంది.



## ఉద్యమకారులకు ఊరట

- అభయహస్తంపై హైకోర్టు కఠిన ఆదేశాలు
- 8 వారాల్లో అమలు చేయాలి..
- ప్రభుత్వానికి కోర్టు స్పష్టమైన గడువు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

అసెంబ్లీ ఎన్నికల సమయంలో అభయహస్తం పథకం కింద ఇచ్చిన హామీల ప్రకారం ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇళ్ల స్థలం, నెలకు సుమారు రూ.25వేల పెన్షన్, ఇతర సంక్షేమ ప్రయోజనాలు అందించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎనిమిది వారాల్లోగా ఈ హామీని అమలు చేయాలని సూచించింది. హామీలు అమలు చేయడంలో ఆలస్యం ఎందుకు జరుగుతోందో వివరించాలని ప్రభుత్వానికి సూచనలు చేసింది. కొందరికి మాత్రమే ప్రయోజనాలు ఇచ్చినట్లయితే దాని ప్రమాణాలు ఏమిటో తెలియజేయాలని కూడా కోర్టు సూచించింది. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకపోతే ప్రజల నమ్మకం దెబ్బతింటుందని వ్యాఖ్యానించింది. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపిస్తూ పలువురు ఉద్యమకారులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై సోమవారం విచారణ చేపట్టిన హైకోర్టు జస్టిస్ బి. విజయసేన్ రెడ్డి ధర్మాసనం ప్రభుత్వానికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. మరోవైపు ఈ ఆదేశాలు తెలంగాణ ఉద్యమకారులకు పెద్ద ఊరట ఇచ్చాయి. ఇప్పటి వరకు అమలు విషయంలో స్పష్టత లేకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుండగా, ఇప్పుడు ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుని స్పష్టమైన జీవో జారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వచ్చే 8 వారాల్లో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందోననే చర్చ జరుగుతున్నది.

## తలా ఓ చెయ్యేసి రాహుల్ గాంధీకి వెయ్యి కోట్లు?

- రేవంత్ వ్యాఖ్యలపై నిప్పులు చెరిగిన కేటీఆర్

**ముద్ర న్యూస్:**



తెలంగాణ రాజకీయాలు మరోసారి హీటెక్కాయి. ఒకవైపు కామారెడ్డి ఎమ్మెల్యే వివాదం నడుస్తుండగానే మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల అంశం కూడా తెరమీదకు వచ్చింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల మాట్లాడుతూ రాహుల్ గాంధీ కుటుంబానికి కావాలిస్తే తెలంగాణలోని కాంగ్రెస్ కార్యకర్తలంతా తల ఓక చెయ్యి వేసి వెయ్యి కోట్లివ్వడం పెద్ద మాట కాదన్నారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రెండేళ్లుగా తెలంగాణను రేవంత్ రెడ్డి దొచుకుంటూ డబ్బుల మూటల్ని కాంగ్రెస్ హైకమాండ్ కు ఢిల్లీకి వెళ్లి ఇస్తున్నారన్నారు. తెలంగాణ కాంగ్రెస్ కు ఎటీఎంలా మారిందన్నారు.గతంలో ఈ విషయాన్నిఎన్నోసార్లు చెప్పామని, ఇప్పుడు సాక్షాత్తూ రేవంత్ రెడ్డే నిస్సిగ్గుగా ఒప్పుకున్నారని మండిపడ్డారు. అదే విధంగా.. రైతన్నలకు, మహిళలకు, యువతకు, అవ్వాతాతలకు ఉద్యోగస్తులకు, రిటైర్డ్ ఉద్యోగస్తులకు ఇస్తామన్న 420 హామీల అమలు గాలికొదిలేసి, వాటికి తనదగ్గర డబ్బులు లేవని రేవంత్ మాట్లాడారని అన్నారు. మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇండ్లను కూలుస్తు, లగచర్లలో గిరిజనుల భూమిని దీనితో పాటు హెచ్‌సీయూ విశ్వవిద్యాలయ భూమిని.. హిల్ట్ పాలసీ పేరిట పరిశ్రమల భూమిని, అనుముల బ్రదర్స్ కలిసి లాక్కోవడానికి రెడీ అయిపోయారని ఆరోపించారు. రెండేళ్లలోనే మూడు లక్షల కోట్ల అప్పు తెచ్చి, రాష్ట్రంలో ఒక్క ఇటుక కూడా పేర్చలేదన్నారు. రేవంత్ రెడ్డి చేస్తున్నదల్లా దండుపాళ్యం ముఠాలాగా. తెలంగాణను దోచుకోవడం, సొంతానికి దాచుకోవడం, పదవిని కాపాడుకోవడం కోసం ఢిల్లీకి సంచులు మోయడమంటూ కేటీఆర్ నిప్పులు చెరిగారు.

# ఓటమి గెలుపునకు నాంది

- మెదక్ అదనపు కలెక్టర్ ఎం.నగేష్
- ముగిసిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ క్రీడలు

**ముద్ర ప్రతినిధి, మెదక్:**





క్రీడల్లో గెలుపు ఓటములు సమానమని మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్ నగేష్ అన్నారు. ఓడిన వారు నిరుత్సాహ పడకుండా మరింత పట్టుదలతో కష్టపడి క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఓటమి గెలుపునకు నాంది అవుతుందని పేర్కొన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో నాలుగు రోజులుగా జరిగిన సెకండ్ ఎడిషన్ సీఎం కప్ 2025 సాఫ్ట్ బాల్ రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు ముగిశాయి. సోమవారం ఔట్ డోర్ స్టేడియంలో ముగింపు కార్యక్రమంలో విజేతలకు అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్ బహుమతులు అందజేశారు. జిల్లా యువజన, క్రీడల అధికారి రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగేష్ పాల్గొన్నారు. రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి సుమారుగా 700 మంది క్రీడాకారులు, 30 మంది కోచ్, మేనేజర్లు, 70 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పురుషుల విభాగంలో రంగారెడ్డి జిల్లా ప్రథమ, హైదరాబాద్ జిల్లా ద్వితీయ, జయశంకర్ భూపాలపల్లి తృతీయ, మహిళల విభాగంలో నిజామాబాద్ జిల్లా ప్రథమ, సిద్దిపేట జిల్లా ద్వితీయ, మహబూబ్ నగర్ జిల్లా తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ కార్యక్రమంలో డిఈఓ విజయ, జిల్లా సైన్స్ ఆఫీసర్ రాజిరెడ్డి, సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రెటరీ శోభన్ బాబు, సాఫ్ట్ బాల్ ఇండియా కోచ్ కృష్ణ, అంతర్జాతీయ క్రీడాకారుడు అభిషేక్ గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, మెదక్ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి శ్యాంసుందర్ శర్మ, వ్యాయామ ఉపాధ్యాయులు మాధవరెడ్డి, దేవేందర్ రెడ్డి, చంద్రమోహన్, అశోక్, ప్రభాకర్, మనోహర్, రమేష్, శంకర్, సత్యం, శ్యాం, రవి, సుజాత కుమారి, పద్మ, లతీఫా, కళ్యాణి, విజయ కృష్ణ, ప్రతాప్ సింగ్, శ్రీధర్ రెడ్డి, డివైఎస్ఓ కార్యాలయ సిబ్బంది రాజు, మనీషా, సాయిబాబా, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
24.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఆరోగ్యకరమైన అలవాట్లు**

శుభ్రతను పాటించడం వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచాలి. ఇది అనేక వ్యాధులను దూరంగా ఉంచుతుంది.



## ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై శ్రద్ధ వహించాలి

**ముద్ర, ఉమ్మడిరంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**



జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత శ్రద్ధ కనబరచాలని ప్రత్యేక డిప్యూటి కలెక్టర్ కే శ్రీనివాస్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 43 ఫిర్యాదులు అందాయి. ప్రజల నుండి వివిధ అంశాలకు సంబంధించిన ఫిర్యాదుల వినతి పత్రాలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.శ్రీనివాస్ జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమము కేవలం సమస్యలు విని దరఖాస్తులు స్వీకరించే విధంగా కాకుండా, పరిష్కారాల వేదికగా నిలిచేలా ప్రతి ఒక్కరు పని చేయాలని, ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**

రంగారెడ్డి జిల్లాలో జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో ముద్రించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్‌ను సోమవారం ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, జిల్లా డీఆర్ఓ సంగీత ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లాలోని మహిళా ఉద్యోగుల కోసం మార్చి 4న ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయాలని జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె.రామారావు జిల్లా కలెక్టర్‌ను కోరారు. అదేరోజు మహిళా ఉద్యోగులకు ఆటలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక అనుమతి ఇవ్వాలని అభ్యర్థించారు. మార్చి 7వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అనుమతివ్వాలని కోరారు. ఈమేరకు జిల్లా కలెక్టర్‌కు డీఆర్ఓ ద్వారా వినతిపత్రం సమర్పించినట్లు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె. రామారావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం మహిళా ప్రతినిధులు శాంతిశ్రీ, రేవతి, అలివేలు, మహేశ్వరి, సైదమ్మ, బాలేశ్వరి, డాక్టర్ నరేందర్, మసూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.



## సమిష్టి కృషితోనే స్పోర్ట్స్ మీట్ విజయవంతం

- **సైబరాబాద్ సీపీ డా.ఎం.రమేష్**

**ముద్ర, శేరిలింగంపల్లి :**

పోలీసు సిబ్బంది విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అదే సమయంలో వ్యక్తిగత జీవితంలో ఆర్థిక క్రమశిక్షణతో మెలగాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ సూచించారు. ఈ నెల 18వ తేదీ నుంచి 21 వరకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన '4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026' విజయవంతం కావడానికి కృషి చేసిన సిబ్బందిని సోమవారం ఆయన అభినందించారు. గచ్చిబౌలిలోని కమిషనరేట్ ఆడిటోరియంలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో, పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను సీపీ ప్రత్యేకంగా ప్రశంసించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ స్పోర్ట్స్ మీట్ విజయవంతం కావడంలో అన్ని విభాగాల సిబ్బంది శక్తి వంచన లేకుండా సమిష్టిగా కష్టపడ్డారని గుర్తు చేశారు. క్రీడల్లో పాల్గొన్న సిబ్బంది ఎటువంటి గాయాలు లేకుండా క్షేమంగా వారివారి యూనిట్లకు తిరిగి వెళ్లడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో జరగబోయే అన్ని క్రీడల్లోనూ సైబరాబాద్ పోలీసులు ఇదే ఉత్సాహంతో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ప్రతిభ ఉన్న సిబ్బందిని గుర్తించి, వారికి తగిన శిక్షణ అందిస్తామని, తద్వారా జాతీయ స్థాయి పోటీల్లోనూ పతకాలు సాధించేలా ప్రోత్సహిస్తామని తెలిపారు.

**వృత్తి నైపుణ్యం - కుటుంబ బాధ్యత..**

సిబ్బంది తమ విధుల్లో బాధ్యతతను పెంచుకోవాలని, తద్వారా కుటుంబ సభ్యులకు నాణ్యమైన సమయాన్ని కేటాయించే అవకాశం ఉంటుందని సీపీ పేర్కొన్నారు. కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాలనుకునే వారికి పోలీస్ శాఖ నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. తెలంగాణ పోలీస్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఎవరి దగ్గరైనా వినూత్న ఆలోచనలు ఉంటే నేరుగా తనను కలిసి నిస్సంకోచంగా చెప్పవచ్చన్నారు.

**ఆర్థిక మోసాల పట్ల అప్రమత్తం..**

పోలీసు సిబ్బంది ఆర్థిక వ్యవహారాల్లో అత్యంత జాగ్రత్తగా ఉండాలని సీపీ సూచించారు. అధిక లాభాల ఆశతో ఎక్కువ వడ్డీకి డబ్బులు పెట్టి మోసపోవద్దని, బ్యాంక్ వడ్డీ కంటే ఎక్కువ ఇస్తామనే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎవరైనా సహచర సిబ్బంది అధికంగా అప్పులు చేస్తున్నట్లు గమనిస్తే, తోటివారు వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ఈసీఆర్ హెడ్‌క్వార్టర్స్ ఏసీపీ షమీర్, సీఎస్‌డబ్ల్యూ ఏసీపీ హనుమంతరావు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అడవి వీడిన మీసాల సింహం

- **మావోయిస్టు అగ్రనేత మీసాల రాజిరెడ్డి లొంగుబాటుతో ముగిసిన ఒక విప్లవ శకం!**
- **వరుస ఎన్ కౌంటర్లు, అగ్రనేతల లొంగుబాట్లు..**
- **మావోయిస్టు ఉద్యమానికి గట్టి దెబ్బ**
- **ఆపరేషన్ కగార్ ప్రభావం.. కదలికల్లో మావోయిస్టు దళాలు**
- **ఎన్‌కౌంటర్లు, అరెస్టులు.. నాయకత్వంలో ఖాళీలు**
- **సాయుధ పోరాటం నుంచి సమాధాన దిశగా అడుగులు**
- **మొదటి తరం నేతల అంతం.. విప్లవ శకానికి ముగింపు సంకేతాలు**
- **దేవ్ జీ, రాజిరెడ్డి లొంగుబాటు.. ఉద్యమానికి కీలక మలుపు**



**ముద్ర న్యూస్ :**

తాడిత, పీడిత ప్రజల కోసం సమసమాజ స్థాపనే ధ్యేయంగా అడవి తల్లి ఒడిలో పురుడు పోసుకున్న నక్సల్ బరి ఉద్యమం ఎన్నో మలుపులు తిరిగి చివరికి అంత్యదిశకు చేరుకుంది. మొదటి తరం నాయకులు కొంతమంది ఎన్ కౌంటర్లలో అసువులు బాసినా, మరికొంతమంది జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకు రావడంతో మావోయిస్టు ఉద్యమంలో అవసాన దశకు చేరుకున్నట్లు కనిపిస్తోంది. పీపుల్స్ వార్ నుంచి మావోయిస్టు పార్టీగా అవతరించిన తరువాత రెండు దశాబ్దాలలో ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమం అదే వేగంగా అంతర్ధానం అయ్యే పరిస్థితికి వచ్చింది. ఈ మధ్య కాలంలో చాలామంది అగ్ర నేతలు వివిధ కారణాలతో రణం వీడి జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు. మావోయిస్టు పార్టీలో నూనూగు మీసాల వయస్సులో చేరి విప్లవోద్యమం లో వివిధ స్థాయిలో పనిచేసి ఎంతోమంది అమరులయ్యారు. మరికొంతమంది వృద్ధాప్యం మూలంగా అనారోగ్యానికి గురై తప్పని పరిస్థితిలో లొంగుబాటులో పయనించారు. నక్సల్ బరి ఉద్యమంలో భాగంగా పీపుల్స్ వార్ పేరుతో తెలంగాణ ప్రాంతంలో విప్లవోద్యమానికి ఊపిరులూదిన మొదటితరం నాయకులు జగిత్యాల జిల్లా బీర్పూర్ కు చెందిన ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి తప్ప మల్లోజ్జల కిషన్ జీ, అజాద్ , ఆర్కే తో పాటు కొంతమంది ఎన్ కౌంటర్లో మృతిచెందగా, మరికొంతమంది నాయకులు ప్రభుత్వానికి లొంగిపోయారు.

**మీసాల రాజిరెడ్డి ప్రస్థానం..**

విప్లవోద్యమంలో మొదటి తరం నాయకుల్లో ఒకరు పెద్దపల్లి జిల్లా మంథని మండలం శాస్త్రులపల్లి గ్రామానికి చెందిన కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రాం అలియాస్ మీసాల రాజిరెడ్డి. 1975 76 సంవత్సరంలో తన చిన్నారి కూతురును బంధువుల వద్ద ఉంచి, భార్యతోపాటు ఉద్యమ బాటపట్టిన రాజిరెడ్డి పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ వివిధ రాష్ట్రలలో పార్టీ కార్యకలాపాలను విస్తరించే పనిలో కీలకపాత్ర పోషించారు. రాజిరెడ్డి మాత్రం పోలీసుల చేతికి చిక్కినా ఎన్నోసార్లు తిరిగి అడవిబాట పట్టారు. ఒకసారి కేరళ రాష్ట్రంలోని అంగమలై ప్రాంతంలో రహస్యంగా సంచరిస్తున్న రాజిరెడ్డిని పోలీసులు అత్యంత చాకచక్యంతో పట్టుకొని కోర్టుకు హాజరుపరిచారు. చాలా సంవత్సరాలుగా అడవి బాట పట్టిన రాజిరెడ్డి పోలీసుల చేతికి చిక్కాడనే వార్త అప్పుడు సంచలనం సృష్టించింది. ఆయనను మంథని కోర్టులో హాజరుపరిచేందుకు వచ్చిన సమయంలో ఆయనను చూసేందుకు పెద్ద ఎత్తున జనం తరలిరావడం గమనార్హం. ఆ తరువాత కొన్ని నెలలు రిమాండ్ లో ఉన్న ఆయన బెయిల్ పై విడుదలైన తరువాత అకస్మాత్తుగా తిరిగి అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు. కొన్ని నెలల తరువాత ఒక ఎనౌకౌంటర్లలో రాజిరెడ్డి మృతిచెందాడని, సోషల్ మీడియాలో ఒక వీడియో చక్కర్లు కొట్టింది. అయితే అది నిజం కాదని, రాజిరెడ్డి క్షేమంగా ఉన్నట్లు పార్టీ ప్రకటించడంతో ఆయన కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు.

**కగార్ తో కంగారు..**

ప్రస్తుతం ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల అణచివేత కార్యక్రమాన్ని చేపట్టిన నేపథ్యంలో సాయుధ పోలీసు బలగాలతో దండకారణ్యాన్ని జల్లెడ పడుతున్నారు. మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్ లోని అంబుజ్ మడ్ ప్రాంతాలలోకి సాయుధ బలగాలు చొచ్చుకొని పోయి అడుగడుగున్న గాలిస్తున్న ఈ తరుణంలో ఈ పరిస్థితుల్లో ఎప్పుడూ ఏ దుర్వార్త వినాల్సివస్తుందోనని వారి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో పార్టీ మనుగడ సాధించడం కష్టమని, ఆయుధ విరమణ చేయడం తప్ప గత్యంతరం లేదని కేంద్ర కమిటీలో కొంతమంది నాయకులు చేసిన ప్రతిపాదనలపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. కొంతమంది ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించినా, మరికొంతమంది వ్యతిరేకించడంతో ఉద్యమ పార్టీలో చర్చ తీవ్రస్థాయికి చేరుకుంది. చివరకు లొంగుబాటే శరణ్యమని భావించి కొంతమంది మావోయిస్టు నేతలు తమ అనుచర బలగాలతో ప్రభుత్వానికి లొంగిపోవడంతో పాటు, సహచర నాయకులను కూడా లొంగిపోవాలని కోరడంతో వారు కూడా అదే బాటలో పయనిస్తున్నట్లు తెలుస్తోంది.

**మరో మలుపు..**

మావోయిస్టు కేంద్ర కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్న జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ తో పాటు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి కూడా స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు లొంగిపోయినట్లు పోలీసు అధికారులు ధృవీకరించారు. అయితే వీరిద్దరిని మీడియా ముందు ఎప్పుడు ప్రవేశపెడుతారో తెలియరాలేదు. ఏదిఏమైనా ఆపరేషన్ కగార్ మావోయిస్టు ఉద్యమాన్ని చిన్నాభిన్నం చేసింది. ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన విప్లవ సంస్థగా పేరున్న పార్టీకి డెడ్ లైన్ పెట్టి సమూలంగా తుడిచివేయాలని కేంద్ర ప్రభుత్వ పంతం చివరి దశకు చేరింది.



## ఎవరీ ఎల్ మెన్చో.. మెక్సికో ఎందుకు తగలబడుతోంది..?

**ముద్ర డెస్క్ :**

మెక్సికో డ్రగ్ మాఫియా సామ్రాజ్యంలో ఒక శకం ముగిసింది. దశాబ్దాలుగా వెతుకుతున్న మోస్ట్ వాంటెడ్ డ్రగ్ లార్డ్.. జాలిస్కో న్యూ జనరేషన్ కార్టెల్ (సీజేఎన్.జీ) అధినేత నెమేసియో ఒసెగేరా సెర్వాంటెస్ (ఎల్ మెన్చో) ఎట్టకేలకు హతమయ్యాడు. ఫిబ్రవరి 22న అమెరికామెక్సికో గూఢచారి సంస్థలు సంయుక్తంగా చేపట్టిన భారీ ఆపరేషన్‌లో అతను మరణించడంతో మెక్సికో వ్యాప్తంగా యుద్ధ వాతావరణం నెలకొంది.

**ఎవరీ 'ఎల్ మెన్చో'? రక్తపాతంతో కూడిన చరిత్ర**

మిచోకాన్ రాష్ట్రంలో జన్మించిన ఎల్ మెన్చో సాధారణ నేరస్థుడిగా మొదలై ప్రపంచంలోనే అత్యంత భయంకరమైన డ్రగ్ సామ్రాజ్యానికి అధిపతిగా ఎదిగాడు. 1994లో అమెరికాలో హెరాయిన్ స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడి జైలు శిక్ష అనుభవించాడు. 2009లో సీజేఎన్.జీని స్థాపించి, మెక్సికోలోని 32 రాష్ట్రాలకు తన అరాచకాలను విస్తరించాడు. డ్రోన్లతో బాంబు దాడులు చేయడం సైనిక హెలికాప్టర్లను కూల్చివేయడం వంటి సాహసాలతో ప్రభుత్వానికే సవాలు విసిరాడు.

**రగులుతున్న మెక్సికో: 'నార్కో టెర్రరిజం' భయం**

ఎల్ మెన్చో మృతి వార్త బయటకు రాగానే అతని అనుచరులు మెక్సికోను రణరంగంగా మార్చారు. ప్రస్తుతం అక్కడ నెలకొన్న పరిస్థితులు భీతావహంగా ఉన్నాయి. గ్వాడలహారా వంటి ప్రధాన నగరాల్లో వందలాది వాహనాలకు నిప్పంటించి రహదారులను దిగ్బంధించారు. హింసకు భయపడి ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పాఠశాలలు, వ్యాపార సముదాయాలు మూతపడ్డాయి. దేశవ్యాప్తంగా భద్రతా బలగాలను మోహరించారు. గ్వాటెమాలా సరిహద్దుల్లో హైఅలర్ట్ ప్రకటించారు.

**భారతీయులకు ఇండోర్‌లో ఉండాలని హెచ్చరిక**

మెక్సికోలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో అక్కడ నివసిస్తున్న భారతీయులకు ఇండియన్ ఎంబసీ అత్యవసర సూచనలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా భారీ నిరసనలు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో బయటకు వెళ్లకుండా ఇండ్లలోనే ఉండాలని సూచించింది. ప్రస్తుతం పరిస్థితులు ఉద్రిక్తంగా ఉండటంతో మెక్సికోలోని భారతీయులు అప్రమత్తంగా ఉండాలని ఎంబసీ మరోసారి హెచ్చరించింది.

**అమెరికా వ్యూహం.. $15 మిలియన్ల వేట**

ఎల్ మెన్చో తల మీద అమెరికా ప్రభుత్వం $15 మిలియన్ల (సుమారు రూ. 125 కోట్లు) బహుమతిని ప్రకటించింది. అమెరికాలోకి భారీగా ఫెంటనిల్, కొకైన్ సరఫరా చేస్తున్న ఈ కార్టెల్‌ను "విదేశీ ఉగ్రవాద సంస్థ"గా అమెరికా గతంలోనే గుర్తించింది. ఈ ఆపరేషన్ విజయంతో మెక్సికో ప్రభుత్వం తన ఉక్కుపాదాన్ని చాటిచెప్పినట్లయింది.

**భవిష్యత్తులో ఏం జరగవచ్చు?**

ఎల్ మెన్చో మరణం ఒక విజయమే అయినా విశ్లేషకులు కొన్ని ఆందోళనలను వ్యక్తం చేస్తున్నారు. నాయకత్వం కోసం కార్టెల్ లోపల ముఠా తగాదాలు మొదలై మరిన్ని హత్యలకు దారితీయవచ్చు. ఎల్ మెన్చో వారసులు తమ ఉనికిని చాటుకోవడానికి మరింత భయంకరమైన దాడులకు పాల్పడే అవకాశం ఉంది. 1990లలో కొలంబియాలో పాబ్లో ఎస్కోబార్ మరణం తర్వాత జరిగినట్లే ఇక్కడ కూడా పౌరులను లక్ష్యంగా చేసుకునే ప్రమాదం ఉంది.

**ఇది శాంతికి నాందినా?**

ఒక గ్యాంగ్‌స్టర్ మరణంతోనే వ్యవస్థాగతమైన డ్రగ్ నెట్‌వర్క్ అంతం కాదు. అయితే ఎల్ మెన్చో వంటి అజేయమైన నేరగాడిని హతం చేయడం ద్వారా ప్రభుత్వం తన పట్టును నిరూపించుకుంది. మెక్సికో వీధుల్లో మంటలు ఆరి శాంతి నెలకొంటుందా లేదా అనేది రాబోయే కొద్ది రోజుల్లో తేలనుంది.

## వన్ టైమ్ రిజిస్ట్రేషన్ గడువు పెంపు

- **వచ్చే నెల 25 తర్వాత పొడగించే ప్రసక్తే లేదు**
- **నిరుద్యోగ అభ్యర్థులకు టీజీపీఎస్సీ సూచన**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**


రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు వన్ టైమ్ రిజిస్ట్రేషన్ (ఓటీఆర్) అప్‌డేట్ చేసుకునే గడువును వచ్చే నెల 25 వరకు పొడిగిస్తున్నట్లు టీజీపీఎస్సీ తెలిపింది. అభ్యర్థులు తమ వివరాలను నమోదు చేసుకోవడానికి ఇదే చివరి అవకాశమని పేర్కొంది. దీని తర్వాత మళ్ళీ గడువు పొడిగించే ప్రసక్తే లేదని కమిషన్ స్పష్టం చేసింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అభ్యర్థులు దరఖాస్తు ఫారమ్‌లో నింపే సమాచారానికి ఓటీఆర్ డేటానే ప్రాథమిక ఆధారం అవుతుందని పేర్కొంది. అభ్యర్థులు కమిషన్ అధికారిక వెబ్‌సైట్ https://www.tgpsc.gov.in ద్వారా తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని తెలిపింది. సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా గడువు ముగియడానికి ముందే వివరాలను సరిచూసుకుని, సంబంధిత పత్రాలను అప్‌లోడ్ చేయాలని సూచించింది. ఇప్పటివరకు ఓటీఆర్ అప్డేషన్ పూర్తి చేయని అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషన్ కోరింది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
24.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ఆరోగ్యకరమైన అలవాట్లు
పరిమిత స్క్రీన్ టైమ్
మొబైల్, కంప్యూటర్ వాడకం తగ్గిస్తే కళ్ళ ఆరోగ్యం మెరుగవుతుంది. మంచి నిద్ర కూడా వస్తుంది.





## టీమిండియాకు కలిసి రాని నరేంద్ర మోడీ స్టేడియం

అహ్మదాబాద్‌లోని ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ మైదానంగా గుర్తింపు పొందిన నరేంద్ర మోదీ స్టేడియం, కీలక ఐసీసీ టోర్నీల్లో మాత్రం భారత్‌కు అనుకూలంగా మారడం లేదు అన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. లక్షలాది మంది అభిమానుల మద్దతు ఉన్నప్పటికీ నిర్ణయాత్మక మ్యాచ్‌ల్లో టీమిండియా ఇక్కడ తడబడుతోంది. ఐసీసీ వరల్డ్ కప్ 2023 ఫైనల్ ఈ వేదికపైనే జరిగింది. టోర్నీ మొత్తం అజేయంగా సాగిన భారత్, తుది పోరులో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోవడం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. భారీ మద్దతు ఉన్నా ఫలితం అనుకూలించలేదు. ఈ మైదానంలోని పిచ్ స్వభావం తరచూ మారుతుండటం జట్లకు సవాలుగా మారుతోంది. ఎరుపు, నలుపు మట్టితో తయారయ్యే వికెట్లపై బౌన్స్ అసమానంగా ఉండటం, బంతి నెమ్మదిగా రావడం బ్యాటర్లను ఇబ్బందులకు గురిచేస్తోంది. సాయంత్రం వేళల్లో మంచు ప్రభావం కూడా మ్యాచ్ గమనాన్ని మార్చేస్తోంది. టాస్ కీలకంగా మారే వేదికగా ఇది గుర్తింపు పొందుతోంది. తాజాగా టీ20 వరల్డ్ కప్ సూపర్ 8 దశలో దక్షిణాఫ్రికా చేతిలో భారత్ ఎదుర్కొన్న ఓటమి కూడా ఈ మైదానంలో పరిస్థితులను సరిగా అంచనా వేయడం ఎంత అవసరమో మరోసారి స్పష్టం చేసింది.

## అక్షర్‌ను ఆడించాల్సిందే: అశ్విన్

టీ20 ప్రపంచకప్ 2026లో వరుసగా నాలుగు విజయాలతో జోరుగా సాగిన భారత్‌కు సూపర్ ఎనిమిది దశలో దక్షిణాఫ్రికా చేతిలో 76 పరుగుల పరాజయం ఎదురైంది. ఈ మ్యాచ్‌లో వైస్ కెప్టెన్ కు బదులుగా ను తుదిజట్టులోకి తీసుకోవడం చర్చకు దారి తీసింది. ఈ నిర్ణయంపై మాజీ క్రికెటర్ అశ్విన్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఐసీసీ టోర్నీల్లో జట్టును స్థిరంగా కొనసాగించడం అవసరమని, అక్షర్ వంటి ఆటగాడిని బయటకు ఉంచడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డాడు. గత ప్రపంచకప్ ఫైనల్లో తో కలిసి అక్షర్ కీలక భాగస్వామ్యం నిర్మించిన విషయాన్ని గుర్తుచేశాడు. అలాగే రింకు సింగ్‌ను ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు పంపడాన్ని కూడా అశ్విన్ ప్రశ్నించాడు. సరైన వ్యూహం లేకుండా కీలక మ్యాచ్‌ల్లో మార్పులు చేయడం జట్టుకు నష్టం చేస్తుందని హెచ్చరించాడు.

**గత ఫైనల్‌లో అక్షర్ ప్రభావం**

టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్లో ప్రారంభంలోనే మూడు వికెట్లు కోల్పోయిన భారత్‌ను అక్షర్ నిలబెట్టాడు. కోహ్లితో కలిసి విలువైన భాగస్వామ్యం నెలకొల్పి జట్టును పోటీ స్థాయికి చేర్చాడు. చివరకు భారత్ స్వల్ప తేడాతో గెలిచి కప్‌ను అందుకుంది.







## భారత్ ఓటమిపై ఆమిర్ వ్యాఖ్యలు..
# అభిమానుల్లో ఆగ్రహం

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో దక్షిణాఫ్రికా చేతిలో భారత్ 76 పరుగుల తేడాతో ఓడిన తర్వాత పాకిస్థాన్ మాజీ పేసర్ మహమ్మద్ ఆమిర్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. భారత జట్టు పరాజయాన్ని ఎద్దేవా చేస్తూ ఆయన చేసిన కామెంట్లు అభిమానులను ఆగ్రహానికి గురిచేశాయి. పాకిస్థాన్ టెలివిజన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమిర్, భారత్ సెమీఫైనల్‌కు చేరదని ముందే చెప్పానని వ్యాఖ్యానించాడు. షో హోస్ట్ ఆయనను సరదాగా "జ్యోతిష్యుడు"గా సంబోధించగా, ఆమిర్ నవ్వుతూ స్పందించడం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ ప్రవర్తనపై భారత అభిమానులు తీవ్రంగా స్పందిస్తున్నారు.అదే సమయంలో, పాకిస్థాన్ జట్టు పరిస్థితిని గుర్తుచేస్తూ ముందుగా తమ జట్టుపై దృష్టి పెట్టాలని నెటిజన్లు సూచిస్తున్నారు. ఒక మ్యాచ్ ఓడినంత మాత్రాన భారత్ పోటీలో నుంచి బయటపడలేదని, మిగిలిన మ్యాచ్‌ల్లో గెలిస్తే సెమీఫైనల్ అవకాశాలు సజీవంగానే ఉంటాయని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.



## మహిళా క్రికెటర్ ఫిర్యాదు..

- **మాజీ ఆటగాడిపై బోర్డు నిషేధం**

బంగ్లాదేశ్ క్రికెట్‌లో వివాదానికి దారి తీసిన ఘటనలో మాజీ అంతర్జాతీయ ఆటగాడు మంజురుల్ ఇస్లాంపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కఠిన చర్యలు తీసుకుంది. లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో ఆయనను తక్షణ ప్రభావంతో అన్ని క్రికెట్ కార్యకలాపాల నుంచి తప్పించింది. బోర్డు పరిధిలో జరిగే ఏ కార్యక్రమంలోనూ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొనరాదని ఆదేశాలు జారీ చేసింది. మాజీ మహిళా కెప్టెన్ జహనారా ఆలం చేసిన ఫిర్యాదు ఆధారంగా స్వతంత్ర కమిటీ విచారణ చేపట్టింది. నాలుగు ఆరోపణలను పరిశీలించిన కమిటీ, వాటిలో రెండు అంశాలకు తగిన ఆధారాలు లభించలేదని తెలిపింది. అయితే మిగిలిన రెండు ఆరోపణల్లో అనుచిత ప్రవర్తనకు సంబంధించిన ప్రాథమిక సాక్ష్యాలు ఉన్నట్లు నిర్ధారించింది. మహిళల జట్టుకు సెలెక్టర్, మేనేజర్‌గా పనిచేసిన మంజురుల్ ఒప్పందం ఈ ఏడాది జూన్ 30తో ముగిసినట్లు బోర్డు వెల్లడించింది. వృత్తిపరమైన నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినట్లు కమిటీ అభిప్రాయపడింది. ఇదిలా ఉండగా, మహిళల బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ నిర్వహణకు బోర్డు ఆమోదం తెలిపింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 4 నుంచి 14 వరకు ఢాకా, ఛటోగ్రామ్ వేదికలుగా ఈ టోర్నీ జరగనుంది. అలాగే జాతీయ సెలక్షన్ ప్యానెల్ ఛైర్మన్ గాజీ అష్రాఫ్ హుస్సేన్ పదవీకాలాన్ని మరో నెల పొడిగించారు.



## భారత్ ఓటమిపై గవాస్కర్ ఆగ్రహం
### ఓవర్ కాన్ఫిడెన్స్ అంటూ చురకలు

టీ20 ప్రపంచకప్‌లో భాగంగా అహ్మదాబాద్‌లోని లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 76 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ఈ ఓటమితో టీమిండియా వరుసగా సాధించిన 12 విజయాల పరంపర ముగిసింది. ఈ ఫలితంపై భారత మాజీ కెప్టెన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పిచ్ పరిస్థితులను అంచనా వేయకుండా ప్రతి బంతినీ భారీ షాట్ ఆడాలని ప్రయత్నించడం వల్లే వికెట్లు కోల్పోయారని విమర్శించారు. అతివిశ్వాసంతో ఆడటం జట్టుకు చేటు చేసిందని ఆయన అభిప్రాయపడ్డారు. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను ఉదాహరణగా చూపిస్తూ, ప్రారంభంలో వికెట్లు కోల్పోయినప్పటికీ , పరిస్థితులకు అనుగుణంగా ఆడి భాగస్వామ్యం నిర్మించారని గుర్తుచేశారు. అదే విధంగా భారత బ్యాటర్లు కూడా పరిస్థితిని బట్టి ఆడాల్సిందని సూచించారు. ఈ పరాజయంతో భారత్ నెట్ రన్‌రేట్ 3.800కి పడిపోయింది. సెమీస్ ఆశలు నిలబెట్టుకోవాలంటే జింబాబ్వే, వెస్టిండీస్‌పై భారీ విజయాలు సాధించడం తప్పనిసరి. తదుపరి మ్యాచ్‌లో మార్పులు అవసరమని, ముఖ్యంగా జట్టులో సమతౌల్యం కోసం అక్షర్ పటేల్‌ను పరిగణలోకి తీసుకోవాలని గవాస్కర్ సూచించారు.



## మా ప్రణాళికే టీమిండియా ఓటమికి కారణం: మిల్లర్

"మేము ముందే సిద్ధం చేసిన ప్రణాళిక ప్రకారం ఆడాం. అదే భారత్‌పై విజయం సాధించడానికి కారణమైంది" అని దక్షిణాఫ్రికా స్టార్ బ్యాటర్ డేవిడ్ మిల్లర్ స్పష్టం చేశాడు. టీ20 ప్రపంచకప్ 2026 సూపర్ ఎనిమిది దశలో అహ్మదాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత్‌పై 76 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. ప్రారంభంలో వికెట్లు కోల్పోయినా, పరిస్థితిని అంచనా వేసి ఇన్నింగ్స్‌ను నిర్మించామని మిల్లర్ తెలిపాడు. ఒత్తిడికి లోనుకాకుండా, జట్టు వ్యూహాలకు కట్టుబడి ఆడటమే విజయ రహస్యం అని పేర్కొన్నాడు. మ్యాచ్‌లో కీలక సమయంలో క్రీజులోకి వచ్చిన మిల్లర్ 35 బంతుల్లో 63 పరుగులు చేసి జట్టును పోటీ స్థాయికి చేర్చాడు. అతని ఇన్నింగ్స్‌తో దక్షిణాఫ్రికా 187 పరుగులు సాధించగా, లక్ష్యాన్ని ఛేదించలేక భారత్ 111 పరుగులకే ఆలౌటైంది.




## భారత్‌కు ఎదురుదెబ్బ.. సెమీస్ ఆశలు ఎలా?

అహ్మదాబాద్‌లో జరిగిన సూపర్8 మ్యాచ్‌లో 76 పరుగుల తేడాతో చేతిలో ఓటమి చవిచూసింది. దీంతో వరుస విజయాల పర్వం ముగిసింది. సెమీఫైనల్ అవకాశాలు కాస్త క్లిష్టంగా మారాయి. అయినా అవకాశాలు పూర్తిగా ముగియలేదు.

**రెండు మ్యాచ్‌లు గెలిస్తే**

సూపర్8లో భారత్‌కు ఇంకా జింబాబ్వే, వెస్టిండీస్‌పై మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఈ రెండింటిలోనూ విజయం సాధిస్తే నాలుగు పాయింట్లు ఖాతాలో చేరతాయి. అదే సమయంలో ప్రత్యర్థి జట్లలో ఏదైనా ఒకటి నాలుగు పాయింట్లకు చేరకపోతే భారత్‌కు మార్గం సులభమవుతుంది. అయితే భారీ ఓటమితో నెట్ రన్‌రేట్ తీవ్రంగా పడిపోవడం ఆందోళనకరం.

**ఒకే మ్యాచ్ గెలిస్తే**

మిగిలిన రెండింటిలో ఒక్కటిలోనే గెలిస్తే సమీకరణాలు మరింత క్లిష్టం అవుతాయి. ఈ పరిస్థితిలో ఇతర మ్యాచ్‌ల ఫలితాలు కీలకం. జింబాబ్వే-వెస్టిండీస్ పోరులో గెలిచిన జట్టును భారత్ తప్పక ఓడించాలి. చివరికి పాయింట్లు సమానంగా ఉన్నప్పుడు నెట్ రన్‌రేట్ ఆధారంగా సెమీస్ టికెట్ నిర్ణయమవుతుంది. మొత్తానికి భారత్‌కు ఇంకా అవకాశం ఉన్నా, మిగిలిన మ్యాచ్‌ల్లో సమగ్ర ప్రదర్శన అవసరం.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
24.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





## టీపీసీసీ చీఫ్‌కు విజయ్–రష్మిక వెడ్డింగ్ ఇన్విటేషన్

టాలీవుడ్ జంట , వివాహ వేడుకకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రముఖులను ఆహ్వానించే కార్యక్రమంలో భాగంగా టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ ను కుటుంబ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయ్ దేవరకొండ కుటుంబ సభ్యుడు రోహిన్ రెడ్డి పెళ్లి ఆహ్వాన పత్రికను అందజేసి, వేడుకకు హాజరుకావాలని కోరారు. ఫిబ్రవరి 26న లో వివాహం జరగనుండగా, అనంతరం హైదరాబాద్‌లో ప్రత్యేక రిసెప్షన్ నిర్వహించనున్నట్లు సమాచారం.



## బాఫ్టా వేదికపై అలియా మెరుపులు

బాలీవుడ్ నటి అలియా భట్ ఫిబ్రవరి 22న జరిగిన బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిలిం అండ్ టెలివిజన్ ఆర్ట్స్ అవార్డుల వేడుకలో ప్రెజెంటర్‌గా సందడి చేసింది. రెడ్ కార్పెట్‌పై గూచీ రూపొందించిన సిల్వర్ గౌన్‌లో హాజరై అందరి దృష్టిని ఆకర్షించింది. వేదికపై మాట్లాడిన ఆమె, సినిమా తన చిన్ననాటి కల అని తెలిపింది. భావోద్వేగమే సినిమాను నడిపిస్తుందని పేర్కొంది. మొత్తంగా బాఫ్టా వేదికపై అలియా లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.




## డెకాయిట్ కొత్త పోస్టర్‌తో అంచనాలు పీక్స్

ప్రాణంగా ప్రేమించిన ఆమె ద్రోహమే హీరోను దోపిడీదారుడిగా మార్చిందన్న కోణాన్ని ప్రధానంగా చూపిస్తూ విడుదలైన 'డెకాయిట్' తాజా పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ప్రేమ, భావోద్వేగం కథకు కీలకంగా మారనున్నాయని స్పష్టమవుతోంది. క్రియేటివ్ కథానాయకుడు అడివి శేష్ నటిస్తున్న ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కథానాయిక. షానిల్ డియో దర్శకత్వంలో రూపొందుతున్న ఈ థ్రిల్లర్‌లో ప్రేమ-ద్రోహం నేపథ్యమే కథను ముందుకు నడిపించనుంది. ఫిబ్రవరి 27న 'రూబారూ' తొలి గీతాన్ని విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది.ఈ సినిమాలో ప్రకాశ్ రాజ్, అనురాగ్ కశ్యప్, సునీల్, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఉగాది కానుకగా మార్చి 19న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## టాక్సిక్–ధురంధర్ పోరుపై వర్మ కామెంట్లు..

**నెట్టింట దుమారం**

వివాదాస్పద దర్శకుడు మరోసారి తన వ్యాఖ్యలతో చర్చనీయాంశమయ్యారు. మార్చి 19న విడుదలకు సిద్ధమైన , చిత్రాలను ఉద్దేశిస్తూ చేసిన సోషల్ మీడియా పోస్టు వివాదానికి దారితీసింది. భారీ బడ్జెట్, హీరో ఎలివేషన్ల కంటే కథలోని మేధస్సే ముఖ్యమని వర్మ వ్యాఖ్యానించారు. ఒకవైపు మెదడుకు పని చెప్పే సినిమా ఉంటే, మరోవైపు అతిశయ యాక్షన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునే శైలీ ఉంటుందని పేర్కొన్నారు. భారీ ఖర్చులు, అసాధ్యమైన యాక్షన్ సన్నివేశాలను ఆయన పరోక్షంగా విమర్శించారు. ఈ వ్యాఖ్యలు ముఖ్యంగా అభిమానులను ఆగ్రహానికి గురి చేశాయి. సోషల్ మీడియాలో వర్మపై విమర్శలు వెల్లువెత్తాయి. అనంతరం ఆయన స్పందిస్తూ తాను ఏ సినిమాను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోలేదని, రెండు



విధానాల మధ్య తేడానే వివరించానని స్పష్టం చేశారు. మార్చి 19న ప్రేక్షకులే తుది తీర్పు చెబుతారని పేర్కొన్నారు.




## 'టాక్సిక్'లో 'కర్మది' పోస్టర్ విడుదల..

**సుదేవ్‌పై దర్శకురాలి ప్రశంసలు**

కన్నడ స్టార్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ యాక్షన్ చిత్రం నుంచి 'కర్మది' పాత్ర పోస్టర్ విడుదలైంది. ఈ పాత్రలో నటించిన పై దర్శకురాలు ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. 'కర్మది' పాత్రకు సుదేవ్ సరైన ఎంపికగా నిలిచారని, చిత్రానికి నిశ్శబ్ద బలంగా నిలిచారని ఆమె పేర్కొన్నారు. తన పాత్రకే కాకుండా మొత్తం సినిమా కోసం అంకితభావంతో పనిచేశారని తెలిపారు. కెవిఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో , , కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఉగాది కానుకగా మార్చి 19న సినిమా విడుదలకు సిద్ధమైంది.




## అదిరిపోయిన 'ఆయా షేర్' ప్రోమో..
### నాని మాస్ లుక్ తో హైప్

నేచురల్ స్టార్ , దర్శకుడు కలయికలో రూపొందుతున్న 'ది ప్యారడైజ్' చిత్రం మరోసారి అంచనాలు పెంచుతోంది. గతంలో వచ్చిన విజయానంతరం ఈ కాంబోపై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి ఉంది. తాజాగా 'ఆయా షేర్' పాట ప్రోమో విడుదల కాగా, గడ్డం-జుట్టుతో రఫ్ మాస్ లుక్‌లో కనిపించిన నాని అభిమానులను ఆకట్టుకున్నాడు. ఆయన బాడీ లాంగ్వేజ్, స్క్రీన్ ప్రెజెన్స్ సినిమాపై హైప్ పెంచుతున్నాయి. పూర్తి పాటను ఫిబ్రవరి 24న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. నాని సరసన కయాదు లోహర్ నటిస్తుండగా, కీలక పాత్రలో కనిపించనున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా ఆగస్టు 24న విడుదలకు సిద్ధమవుతోంది.




## వరుస హిట్లతో కిరణ్ అబ్బవరం పారితోషికం జంప్?

సినీ రంగంలో హీరోల మార్కెట్ స్థాయి వారి తాజా విజయాలపై ఆధారపడుతుంది. బ్యాక్ టు బ్యాక్ హిట్లు వస్తే పారితోషికం పెరగడం సహజం. ఈ జాబితాలో యువ కథానాయకుడు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఇటీవల విడుదలైన 'క', 'కే ర్యాంప్'' చిత్రాలు మంచి వసూళ్లు సాధించడంతో ఆయన మార్కెట్ రేంజ్ పెరిగిందని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. కథా ప్రాధాన్యత ఉన్న సినిమాలను ఎంపిక చేసుకోవడంలో కిరణ్ అబ్బవరం చూపుతున్న శ్రద్ధ నిర్మాతల్లో నమ్మకం పెంచిందని సమాచారం. ఆయన నటిస్తే కనీస వసూళ్లు వస్తాయనే భావన బలపడుతోందని టాక్. ప్రస్తుతం ఒక్కో ప్రాజెక్ట్‌కు సుమారు రూ.12 కోట్ల వరకు పారితోషికం తీసుకుంటున్నట్లు ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఓ ప్రముఖ నిర్మాణ సంస్థతో కుదిరిన ఒప్పందంలోనూ ఇదే స్థాయిలో రెమ్యునరేషన్ అందుకున్నారని వినికిడి. ఇప్పుడు 'చెన్నై లవ్ స్టోరీ 'లో నటిస్తున్న ఆయనకు ఈ సినిమా కూడా ప్లస్ అవుతుందనే అంచనాలు ఉన్నాయి. వరుస విజయాల వేగాన్ని కొనసాగిస్తే యువ హీరోల్లో స్థిరమైన స్థానాన్ని మరింత బలపరుచుకునే అవకాశం ఉందని సినీ విశ్లేషకుల అభిప్రాయం.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com